

ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
గురువారం, 14 నవంబరు 2024

గోదావరిలో మృతదేహం

భద్రాచలం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని గోదావరి నది సమీపంలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సుమారు 50 నుంచి 55 సంవత్సరాల వయస్సు కలిగి ఉండి, చామనచాయ శరీర రంగు, నలుపు, తెలుపు రంగు జుట్టు కలిగి, ఎల్లో రంగు నిలువు గీతల చొక్కాని ధరించి, గడల లుంగీతో ఉన్నట్లు గుర్తించారు. ఇతను వెంట ఒక లగేజీ బ్యాగు కూడా ఉంది. ఎవరైనా ఇతని ఆచూకీ లభిస్తే భద్రాచలం పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. వివరాలకు 8712682106లో సంప్రదించాలని కోరారు.



ఆయిల్‌పామ్ రైతు ఖుషీ

- 2024-25కు నూనె దిగుమతి శాతం 19.42గా నిర్ధారణ
- పామాయిల్ గెలల టన్ను ఒక్కంటికి రూ.160 చొప్పున పెరుగుదల
- దేశంలోనే అత్యధిక ఓఈఆర్‌గా రికార్డు
- ఫలించిన పామాయిల్ రైతు సంఘం కృషి

6



డిజిటల్ టెంపుల్

- పారదర్శకతే లక్ష్యంగా భద్రాద్రి రామాలయంలో సేవలు ప్రారంభం
- అన్నదానం టోకెన్లు, ప్రొటోకాల్ దర్శనం, వస్త్రాల సమర్పణలో అమలు
- ప్రారంభించిన ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు
- రాష్ట్రంలోనే తొలి డిజిటల్ దేవస్థానంగా ఖ్యాతి

6



అపురూప దైవభక్తి

- కోటి రూపాయల వ్యయంతో శ్రీయంత్ర సహిత కాళేశ్వరస్వామి ఆలయ నిర్మాణం
- ఆకట్టుకుంటున్న 14అడుగుల స్వామి విగ్రహం
- కార్తీక మాసంలో ఘనంగా కొనసాగుతున్న పూజలు
- ఆదర్శంగా నిలుస్తున్న గిరిజన దంపతులు

7

లోకల్ గైడ్స్‌ను ఏర్పాటు చేస్తాం

బి.సుమన్‌చక్రవర్తి,
జిల్లా పర్యాటకశాఖ అధికారి, ఖమ్మం



ఫటాఫట్

ప్రశ్న: ఖమ్మం జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: విస్తృత చర్యలు చేపట్టడం జరిగింది. ఖమ్మం ఖిల్లాకు రూ.30 కోట్లు, పాలేరు రిజర్వాయర్‌కు రూ.5 కోట్లు, నేలకొండపల్లి బౌద్ధస్థూపానికి రూ.2.50 కోట్లు, మధిర ట్యాంక్‌బండ్‌కు రూ.5కోట్లు, జమలాపురం ఆలయ అభివృద్ధికి రూ.5 కోట్లు ప్రభుత్వం కేటాయించింది.

ప్ర: పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయి?

జ: పూర్తిస్థాయి సర్వే రిపోర్టు ఇవ్వాల్సి ఉంది. రాగానే పనులు ప్రారంభిస్తాం.

ప్ర: పర్యాటక అభివృద్ధికి ఏమైనా ప్యాకేజీలు రూపొందించారా?

జ: అటవీశాఖ పులిగుండాలలో ఏకోటూరిజం అభివృద్ధి చేస్తోంది. విద్యార్థులకు అడవులు, పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు పర్యాటకశాఖ నుంచి ప్యాకేజీ ఏర్పాటుచేస్తున్నాం. ఆయా పాఠశాలలు, కళాశాలల విద్యార్థులను బస్సుల్లో తీసుకెళ్లి చూపించడం జరుగుతుంది.

ప్ర: పర్యాటక శాఖ తరఫున లోకల్ గైడ్స్‌ను ఏర్పాటు చేస్తున్నారా?

జ: లోకల్ గైడ్స్‌ను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఉంది. దీనికి ఎన్ఐటీహెచ్ఎం ద్వారా శిక్షణ ఇచ్చి స్థానిక పర్యాటకంపై పర్యాటకులకు వివరించే విధంగా రూపకల్పన చేస్తున్నాం.

-ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఖమ్మం

ఖమ్మం మార్కెట్‌కు మూడు రోజుల సెలవులు

ఖమ్మం మార్కెట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు ఈ నెల 15నుంచి 17వరకు వరుసగా మూడు రోజులు సెలవులు ఉన్నట్టు మార్కెట్ సెక్రెటరీ ప్రవీణ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 15శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా, శని, ఆదివారాలు వారాంతం కారణంగా సెలవులు ఉన్నట్టు తెలిపారు. తిరిగి ఈనెల 18 సోమవారం నుంచి మార్కెట్‌లో యథావిధిగా క్రయవిక్రయాలు ఉంటాయని తెలిపారు.

పలు చోట్ల వర్షం

ఖమ్మంమార్కెట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం సాయంత్రం పలు మండలాలలో అకస్మాత్తుగా వర్షం కురిసింది. ఖమ్మం రూరల్, ముదిగొండ, రఘునాథపాలెం, కామేపల్లి తదితర మండలాలతోపాటు మిగతా మండలాలల పరిధిలో కొన్ని చోట్ల చిరుజల్లులు, మరికొన్ని చోట్ల మోస్తారు జల్లులు పడ్డాయి. అకాల వర్షంతో పత్తి, ధాన్యం రైతులు కొంత ఇబ్బందులు పడ్డారు. ధాన్యం కల్లాల్లో ఆరబోయగా తక్షణమే స్పందించి పట్టాలు ఏర్పాటు చేసుకున్న రైతులు బయటపడగా.. మరికొంత మంది రైతుల ధాన్యం తడిచిపోయింది. ఇక పత్తి చేలలో విరబూసిన పత్తి పూలు తడిసి ముద్దయ్యాయి.



తీపిలో చేదు...

- విస్తరిస్తున్న మధుమేహం
- రాష్ట్రస్థాయిలో పదో స్థానంలో జల్లా
- అవగాహనతోనే దూరం: నిపుణులు
- నేడు ప్రపంచ మధుమేహ నిరోధన దినం

6

చెక్.. చెక్‌పోస్ట్



'రవాణా' రాబడికి గండి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదాయం వచ్చే ప్రభుత్వశాఖల్లో రవాణాశాఖ చాలా ముఖ్యమైనది. ద్విచక్ర వాహనాల నుంచి భారీ వాహనాల రిజిస్ట్రేషన్ల వరకు రవాణా వాహనాల బోర్డర్ ట్యాక్స్, ఓవర్ లోడింగ్, ఫిట్‌నెస్, రెన్యూవల్స్, క్వార్టర్ ట్యాక్స్ కలెక్షన్ నుంచి వాహనాలపై పర్యవేక్షణ మొత్తం రవాణాశాఖ ద్వారానే జరుగుతుంది. అయితే ఎంవీఐలు వాహన తనిఖీలు చేపడుతున్నప్పటికీ, 2023-2024లో ఆ మేరకు రవాణాశాఖ ఆదాయం పెరగకపోగా ఐదేళ్ల కంటే గరిష్టంగా తగ్గిపోయింది. రాష్ట్రాల సరిహద్దులో ఉన్న జిల్లాల చెక్‌పోస్టులు, ఎంవీఐల వాహన తనిఖీల ద్వారా రవాణాశాఖకు అత్యధిక ఆదాయం సమకూరుతోంది. ఇతర రాష్ట్రాల రవాణా వాహనాలు తెలంగాణలోకి ప్రవేశించాలంటే సరిహద్దు చెక్‌పోస్టులో కచ్చితంగా బోర్డర్ ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది.

- రూ.112కోట్ల నుంచి రూ.93కోట్లకు పడిపోయిన ఆదాయం
- చెక్‌పోస్టుల వద్ద నిబంధనల అమలులో లోపాలే కారణం
- బోర్డర్ ట్యాక్స్, ఓవర్‌లోడింగ్, ఇతర ఛార్జీలు, జరిమానాల తీరుపై పలు ఆరోపణలు
- ఎంవీఐలు వాహన తనిఖీలు నిర్వహిస్తున్నా పెరగని ఆదాయం
- జాతీయ రహదారుల విస్తరణతో అంతర్‌రాష్ట్ర వాహనాల జోరు
- ఆ మేరకు కనిపించని రాబడి

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో బోర్డర్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. చెక్‌పోస్టుల్లో సరైన పర్యవేక్షణ ఉండటం వల్ల రవాణా వాహనాల పర్మిట్‌లు, అధిక లోడింగ్‌పై క్వార్టర్లీ, ట్యాక్స్‌లు లేని వాహనాలకు జరిమానాల ద్వారా ఆదాయం పెరుగుతుంది. వాహనాల భద్రతా ప్రమాణాలు పెరిగి రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయి. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషితో జిల్లాలో జాతీయ రహదారుల విస్తీర్ణం జరగటంతో గతంలో రాజమండ్రి, వైజాగ్ ఓడరేవులకు విజయవాడ నుంచి వెళ్లే వాహనాలు సైతం ఇప్పుడు ఖమ్మం రహదారుల నుంచి ప్రయాణాలు సాగిస్తున్నాయి. ఈ క్రమంలో ఖమ్మం జిల్లా రహదారులపై రద్దీ పెరిగింది. భారీ రవాణా వాహనాలు నిత్యం వందల సంఖ్యలో ప్రయాణాలు జరుపుతున్నాయి. దీంతో రవాణాశాఖ ఆదాయం ప్రతి సంవత్సరం పెరుగుతూ వస్తూ రాష్ట్ర ఖజానాకు ఆర్థిక పుష్టిని నింపింది.

నో 'చెక్' పోస్ట్

ఉమ్మడిఖమ్మం జిల్లా సరిహద్దులోనే ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు వ్యాపించి ఉన్నాయి. జాతీయ రహదారులు జిల్లానుంచి ఏర్పాటు కావటంతో అన్ని రాష్ట్రాల రవాణా వాహనాలు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి సరుకు, ప్రయాణికుల రవాణా జరుగుతున్నాయి. దీంతో అశ్వారావుపేట, కల్లూరు, పాల్వంచ చెక్‌పోస్టులు, వైరా, సత్తుపల్లి స్థానిక మోటారు వాహన ఇన్‌స్పెక్టర్ కార్యాలయాలు రవాణాశాఖాపరంగా ఏర్పాటు చేశారు. వీటి ద్వారా వాహనాలపై పర్యవేక్షణ జరుగుతోంది.

పెరగని ఆదాయం

జాతీయ రహదారులు ఖమ్మం జిల్లా నుంచి వెళ్లటంతో ఇతర రాష్ట్రాల భారీ వాహనాలు ఖమ్మం జిల్లా రహదారుల నుంచి ప్రయాణాలు సాగుతుంటాయి. వీటితో పాటుగా గ్రానైట్ వ్యాపారం విస్తరించటం, ఖనిజ వనరులు, వ్యవసాయ మార్కెట్లు ఇతర రంగాల్లోనూ ఖమ్మం జిల్లా అగ్రగామిగా ఉంటుంది. దీంతో ఇతర రాష్ట్రాల రవాణా వాహనాలు ఖమ్మం జిల్లాకు వస్తుంటాయి. జిల్లా రహదారుల నుంచి ప్రయాణాలు సాగిస్తుంటాయి. అయితే గత కొద్ది నెలలుగా ఖమ్మం జిల్లా రవాణా అధికారి సెలవుపై వెళ్లటంతో ఖమ్మం ఎంవీఐ, ఇన్‌చార్జ్ డీటీవోగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

సిబ్బంది కొరతే కారణం

వెంకటరమణ, ఇన్‌చార్జ్ డీటీవో, ఖమ్మం జిల్లా



అధిక లోడుతో రవాణా చేసే వాహనాలు, బోర్డర్ ట్యాక్స్ చెల్లించని వాహనాలు, పర్మిట్ లేకుండా ప్రయాణించే వాహనాలు, క్వార్టర్లీ ట్యాక్స్ చెల్లించని వాహనాలకు కాంపౌండింగ్ చార్జీలు ఎంవీఐల ద్వారా జరిమానాలు విధించటం జరుగుతుంది. జిల్లాలో ఏఎంవీఐలు, ఎంవీఐల కొరత ఉంది. నిబంధనల మేరకు వాహన తనిఖీలు చేస్తున్నాం. 2022-2023కు ముందు ఆదాయం ఎందుకు పెరిగిందో నాకు తెలియదు.

ఆదాయం ఇలా...

సంవత్సరం	ఆదాయం
2019-2020	రూ.96.22 కోట్లు
2020-2021	రూ.102.38కోట్లు
2021-2022	రూ.110.23కోట్లు
2022-2023	రూ.111.98కోట్లు
2023-2024	రూ.93.58 కోట్లు

ఖమ్మం, వైరా, సత్తుపల్లిలో ఏర్పాటు చేసిన రవాణాశాఖ అధికారులు సైతం రెగ్యూలర్‌గా వాహన తనిఖీలు చేపడుతున్నారు. కల్లూరు, అశ్వారావుపేట, పాల్వంచ చెక్ పోస్టుల్లోనూ వాహనాల తనిఖీలు పారదర్శకంగా నిర్వహించటం లేదని విమర్శలు వెలువడుతున్నాయి. దీంతో ఇతర రాష్ట్రాల రవాణా భారీ వాహనాలు సైతం ఖమ్మం జిల్లా రహదారుల నుంచి ప్రయాణాలు సాగిస్తున్నా వాటిపై రవాణాశాఖ నిబంధనల మేరకు జరిమానాలు, ట్యాక్స్ వసూళ్లు చేయకపోవటంతో రవాణాశాఖ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. ఐదేళ్లకంటే గరిష్ఠంగా రవాణా శాఖ ఆదాయం పడిపోయిందని బహిరంగంగా చర్చలు జరుగుతున్నాయి.

విషాదాంతమైన సహజీవనం

- నమ్మి వచ్చిన ప్రియురాలిని కడతేర్చిన ప్రియుడు
- హత్య చేసి, శవాన్ని పత్తిచేలో పూడ్చిపెట్టిన వైనం
- ఆర్థికపరమైన గొడవలే కారణం
- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన
- భద్రాద్రి జిల్లా మాచినేనిపేట తండాలో సంచలనం



స్వాతి మృతదేహాన్ని పాతిపెట్టిన ప్రదేశం వద్ద మట్టి తోడుతున్న దృశ్యం



బానోతు భద్రం, తోట స్వాతి (ఫైల్)

జూలూరుపాడు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సమాజంలో రోజు రోజుకూ క్షీణిస్తున్న విలువలకు, పెరుగుతున్న నేరప్రవృత్తికి ఈ సంఘటనే సాక్ష్యం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలంలోని మాచినేనిపేట తండాలో వెలుగుచూసిన మహిళ హత్య పోలీసులను నివ్వెరపరిచింది. తనతో సహజీవనం చేస్తున్న మహిళను ఓ వ్యక్తి కిరాతకంగా కడతేర్చిన సంఘటన కలకలం రేపింది. ఒకదాని తర్వాత ఒకటిగా వరుసగా చోటుచేసుకున్న సంఘటనలు చివరకు హత్యతో ముగియగా, అందుకు బాధ్యుడైన వ్యక్తి కటకటాల పాలయ్యాడు. అతడిపైన ఆధారపడిన భార్య, కుమారుడు రోడ్డున పడ్డారు. సంచలనం సృష్టించిన ఈ సంఘటన పూర్వాపరాల్లోకి వెళ్లితే...

భూపాలపల్లికి చెందిన తోట స్వాతి(32)కి మణుగూరు మండలం తోగ్గూడెం గ్రామానికి చెందిన వ్యక్తితో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి సంతానం లేదు. భర్త అనారోగ్యంతో మృతి చెందడంతో స్వాతి కొత్తగూడెంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఆయాగా పని చేసేందుకు ఆరేళ్ల క్రితం వచ్చింది. అప్పటికే అదే పాఠశాలలో జూలూరుపాడు మండలం మాచినేనిపేట తండాకు చెందిన బానోతు భద్రం పీఈటీగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో వీరిద్దరి మధ్య వివాహేతర సంబంధం ఏర్పడి తండాలో సహజీవనం చేసేస్థాయికి వెళ్లింది.

స్వాతితో సహజీవనం చేస్తూనే భద్రం మాచినేనిపేటతండాకు చెందిన నందిని అనే యువతిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. నందినితో వివాహం జరిగిన తరువాత కూడా స్వాతితో సహజీవనం కొనసాగించాడు. ముగ్గురూ కలిసి మాచినేనిపేట తండాలోని ఒకే ఇంట్లో ఉంటున్నారు. స్వాతి కొత్తగూడెంలోని ఓ వస్త్ర దుకాణంలో పని చేస్తుండగా నందిని ఇంటి వద్దనే ఉంటోంది.

ఈ క్రమంలో వారి కుటుంబంలో కలహాలు మొదలయ్యాయి. భద్రం భార్య నందినిపై స్వాతి అక్కసు పెంచుకుంది. నందిని అడ్డు తొలగించుకోవాలని ఆమె పన్నాగం పన్నింది. ఈ క్రమంలో వస్త్ర దుకాణంలో తనతోపాటే పని చేస్తున్న జూలూరుపాడు మండలం సాయిరాంతండాకు చెందిన వివాహితుడైన హలావత్ రత్నకుమార్‌తో వివాహేతర సంబంధం (మిగతా 6వ పేజీలో)

గ్రూప్-3 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- ఒక రోజు ముందుగానే ఏర్పాట్లు పూర్తి చేయాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి
- పరీక్ష కేంద్రాల వద్ద నిషేధాజ్ఞల అమలు : సీపీ సునీల్‌దత్

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 17, 18తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-3 పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కమిషన్ చైర్మన్ ఎం.మహేందర్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులతో కలిసి హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గ్రూప్-3 పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ అన్ని దశల్లో ఏర్పాట్లలో లోటుపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాట్లను శాఖాధికారి, సంబంధిత పరీక్షా కేంద్ర చీఫ్ సూపరింటెండెంట్‌తో సమన్వయం చేసుకొని, ఒక రోజు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. చీఫ్ సూపరింటెండెంట్‌కు తప్ప ఎవరికీ పరీక్షా కేంద్రం లోపలికి మొబైల్ ఫోన్ అనుమతి లేదన్నారు. స్క్రైబ్‌ల జాబితా పంపించినట్లు, ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్ష విధుల సిబ్బంది, అధికారులు కేంద్రానికి ముందస్తుగా చేరుకొని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. అదనపు కలెక్టర్ శ్రీజ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో 27,984 మంది గ్రూప్-3 పరీక్షలు రాయనున్నారని, 87 పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు, నిబంధనల మేరకు అన్ని చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, కలెక్టరేట్ ఏవో అరుణ పాల్గొన్నారు.



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న శ్రీజ

పరీక్ష కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు: సీపీ

ఖమ్మం క్రైం: గ్రూపు 3 పరీక్షల నేపథ్యంలో ఆయా పరీక్షా కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ యాక్టు 2023 అమల్లో ఉంటుందని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. ఖమ్మం కమిషరేట్ పరిధిలో 87పరీక్షా కేంద్రాల్లో నిర్వహించే పరీక్ష సందర్భంగా 17 ఉదయం ఆరుగంటల నుంచి 18 సాయంత్రం ఆరుగంటల వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు. పరీక్షా కేంద్రాలకు 500 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా ఉండవద్దని, ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు డీజేలతో ఊరేగింపులు, ధర్నాలు, ప్రచారాలు నిర్వహించకూడదన్నారు. పరీక్షా సమయంలో సమీప ప్రాంతాల్లో ఇంటర్‌నెట్ సెంటర్లు, జిరాక్స్ షాపులు మూసివేయాలని తెలిపారు. ట్రాఫిక్ ఎలాంటి అంతరాయం కలగకుండా ట్రాఫిక్ పలీసులు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. అదేవిధంగా ప్రత్యేకంగా పోలీసు పెట్రోలింగ్ పార్టీలు నియమించామని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలను జరగకుండా ఉండేందుకు నిఘాను నియమించి సమాచారం సేకరించేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.



సీసీఐ కొనుగోలు కేంద్రంలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న సీపీ సునీల్‌దత్

పత్తికి మద్దతు ధర చెల్లించాలి

- రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు
- పోలీసు కమిషనర్ సునీల్‌దత్
- తల్లాడలో సీసీఐ కొనుగోలు కేంద్రం తనిఖీ

తల్లాడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సీసీఐ కొనుగోలు కేంద్రానికి విక్రయించేందుకు వచ్చే పత్తి రైతులను కొనుగోలు విషయంలో ఇబ్బందులకు గురిచేయవద్దని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ ఆదేశించారు. తల్లాడలోని స్టేపుల్ రీచ్ జిన్నింగ్ మిల్లులోని సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పత్తిలో తేమశాతం, నాణ్యతను పరీక్షించే మిషన్‌తో కొణిజర్ల మండలం పల్లిపాడు గ్రామానికి చెందిన ఓ రైతు విక్రయించేందుకు వచ్చిన పత్తిని పరీక్షించారు. పత్తిలో 11 నుంచి 12శాతం మేరకు తేమ రావడంతో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాకు రూ.7220 ధర చెల్లించాలని వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ సహాయ కార్యదర్శి వి.వెంకటేశ్వర్లును సీపీ ఆదేశించారు. పత్తి కాంటా వేసేటప్పుడు కటింగ్ పెడుతున్నారా అని రైతులను ప్రశ్నించగా అటువంటిది ఏమీ లేదని వారు సమాధానమిచ్చారు. తేమశాతం పేరుతో ఇబ్బందులు తలెత్తకుండా నిబంధనల ప్రకారం పూర్తి పారదర్శకంగా కొనుగోళ్లను కొనసాగించాలని సీపీ సూచించారు. వేబ్రిడ్జిని పరిశీలించి ఆన్‌లైన్ బిల్లింగ్ విధానాన్ని తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఐ బి.కొండల్‌రావు, జిన్నింగ్‌మిల్లు నిర్వాహకులు మరికంటి రాహుల్, సింగిరికొండ సతీష్, బయ్యర్ ఉమేష్ పాల్గొన్నారు.

ఏసీ మిర్చి ధరలు ధమాల్

ఒక్కరోజులోనే క్వింటాలుకు రూ.500 డౌన్



ఖమ్మం మార్కెట్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): తేజా రకం ఏసీ మిర్చి ధరలు రోజురోజుకూ పతనమవుతున్నాయి. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం క్వింటాలు మిర్చిని రూ.17,500 జెండాపాట ధర నిర్ణయించగా వ్యాపారులు నాణ్యతను బట్టి క్వింటాలు రూ.12,000 నుంచి రూ.14,500 వరకు కొనుగోలు చేశారు. మార్కెట్‌లో మంగళవారం క్వింటాలు రూ.18,000 పలికిన మిర్చి ధర ఒక్క రోజులోనే క్వింటాలుకు రూ.500 తగ్గింది. నెలరోజుల క్రితం ధరతో పోలిస్తే క్వింటాలుకు సుమారు రూ.3,000 తగ్గింది. ఇదిలా ఉండగా తేజారకం మిర్చికి చైనా, సింగపూర్, మలేషియా, థాయిలాండ్, శ్రీలంక, బంగ్లాదేశ్ తదితర దేశాలకు ఎగుమతులు నిలిచిపోవడంతో ధరలు తగ్గుముఖం పడుతున్నాయని వ్యాపారులు తెలిపారు. దీంతో రైతులు అయోమయంలో పడిపోయారు. ఈ ఏడాదైనా గిట్టుబాటు ధర దక్కుతుందని భావించి భారీ స్థాయిలో పంట సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు.

నిర్బంధకాండను ఆపాలి..

- లగచర్లలో బలవంతపు భూసేకరణ మానుకోవాలి
- సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు



ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలో లగచర్ల తదితర గ్రామాల్లో ఫార్మా కంపెనీల కోసం భూముల సేకరణ విషయంలో ప్రజల ఆందోళనను ప్రభుత్వం అర్థం చేసుకోవాలని, బలవంతపు భూసేకరణ మానుకోవాలని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఖమ్మంలో బుధవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. కొంతమంది వ్యక్తులు అధికారులపై చేసిన దాడిని అవకాశంగా తీసుకొని పోలీసు బలగాలు గ్రామాల మీదపడి ప్రజలను తీవ్రంగా నిర్బంధించటం సరైన విధానం కాదన్నారు. ప్రజలు తమ భూములు కోల్పోతున్నామనే భయంతో ఆందోళనలు చేశారని, వారికి భూమే ఆధారం అనే విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలని కోరారు. ప్రజల ఇష్టం మేరకు ఫార్మ కంపెనీలకు భూములు కేటాయించాలని సూచించారు. ప్రభుత్వం ప్రజల పక్షాన నిలబడాలని ప్రైవేట్ కార్పొరేట్ శక్తుల కోసం పనిచేయవద్దని హితవు పలికారు. ప్రజల పక్షాన నిలబడేందుకు సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కమిటీ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. పోలీసు నిర్బంధకాండను వెంటనే నిలిపేయాలని డిమాండ్ చేశారు.

తీపిలో చేదు..



నేడు ప్రపంచ మధుమేహ నిరోధన దినం

- విస్తరిస్తున్న మధుమేహం
- రాష్ట్రస్థాయిలో పదో స్థానంలో జిల్లా
- అవగాహనతోనే దూరం: నిపుణులు

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నలభై ఏళ్ల నిండిన సాధారణ వ్యక్తికి వైద్యం సమయంలో చేసే సాధారణ పరీక్షలు బీపీ (రక్తపోటు) షుగర్ (మధుమేహం) నాలుగు పదులు దాటిన తర్వాత కనీసం 45-50 శాతం మందికి ఈ వ్యాధులు వస్తున్నాయంటూ వైద్యులు ధ్రువీకరిస్తున్నారు. అయితే ప్రస్తుతం పంథా మారుతోంది. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు వీటి బారిన పడుతూనే ఉన్నారు. రాష్ట్రంలో ఇటీవల నిర్వహించిన సర్వేల్లో మధుమేహ వ్యాప్తిలో జిల్లా 10వ స్థానంలో ఉంది. జిల్లాలో దీని బారిన పడుతున్న వారి సంఖ్య ఏటా పెరుగుతోంది. నేడు ప్రపంచ మధుమేహ నివారణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

మధుమేహం రావడానికి కారణాలు

మానవ శరీరంలో ఇన్సులిన్ ఉత్పత్తి కాకపోవడాన్ని



టైప్-1 మధుమేహం అని, ఉత్పత్తి అయినా ఇన్సులిన్ సమర్థవంతంగా ఉపయోగపడకపోతే టైప్-2 మధుమేహంగా భావిస్తారు. హార్మోన్‌స్థాయి తగ్గడం రక్తంలో అధిక గ్లూకోజు వ్లల వచ్చే రుగ్మత ఈ మధుమేహం. అతి మూత్రం, బద్దకం, మందగించిన చూపు, అతిగా దాహం వేయడం సాధారణ లక్షణాలు. కుటుంబంలో తల్లిదండ్రులకు మధుమేహం ఉండటం అధిక బరువు, ఊబకాయం, ఎక్కువ శ్రమలేని జీవితం గడిపేవారు మానసిక ఒత్తిడికి కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ స్థాయి ఎక్కువగా ఉండడం వంటి కారణాలతో మధుమేహం బారిన పడేందుకు అవకాశం ఉంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం చైనా, అమెరికా, భారతదేశం ఈ వ్యాధిలో అగ్రగామిగా ఉన్నాయి. ఒక సారి మధుమేహం బారిన పడ్డారంటే దాని ప్రభావం కొనసాగుతూనే ఉంటుంది. ప్రతిచోట దాదాపు 35శాతం యువత వ్యాధి బారిన పడుతుండడం ఆందోళన కలిగిస్తున్న అంశం.

● షుగర్ వ్యాధిని ఎంత అర్థం చేసుకుంటే అంత ఆ వ్యాధి వల్ల కలిగే ఉపద్రవాలను అపోహలను సరిచేసుకోవచ్చు. ముఖ్యంగా షుగర్ ఉన్నదంటారని భయపడి పరీక్షలు చేయించుకోవడానికి వెనుకాడడం, ఇన్సులిన్ ఒక సారి తీసుకుంటే ఇక జీవితాంతం తీసుకోవాల్సి వస్తుందని భయపడడం చిన్నపిల్లలకు తీపిని ఇష్టపడని వారికి షుగర్ వ్యాధి రాదనుకోవడం పుండు మానుతుంటే షుగర్ వ్యాధి రానట్లే అని వచ్చినా కంట్రోల్‌లో ఉండి ఉంటుందని, షుగర్ లక్షణాలు రాలేదు కదా అనే అతి నమ్మకాల వల్ల వ్యాధి ముదిరిపోతోంది. వయస్సుతో, వృత్తితోనూ వంశంలో ఇతరులకు లేకపోవడంతో నిమిత్తం లేకుండా షుగర్ వ్యాధి ఎవరికైనా, ఎప్పుడైనా రావచ్చు. అయితే షుగర్‌పరీక్ష చేయించుకోవడానికి వెనుకాడే వారిలో మూడొంతుల మంది తమకు తెలియకుండానే ఈ వ్యాధి ని మోస్తున్నారనేది వాస్తవం.

● దీనిలో భాగంగానే ఇలాంటి వ్యాధులను కట్టడి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకం కింద నాన్ కమ్యునికేబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ) కార్యక్రమాన్ని 2018లో ప్రారంభించింది. 30ఏళ్లు పైబడిన వారిలో రక్తపోటు, మధుమేహం, నోటి, రొమ్ము గర్భకోశ క్యాన్సర్‌కు గురైన వారిని గుర్తించే ప్రక్రియను ప్రారంభించింది. విలేజ్ హెల్త్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం ద్వారా జిల్లాలో అప్పుడే పుట్టిన బిడ్డనుంచి వయో వృద్ధుల వరకు ప్రతి ఒక్కరినీ నమోదు చేస్తున్నారు. వీటిలో 30ఏళ్లు పైబడిన వారిని గుర్తించి వారికి ప్రత్యేకంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు.

జిల్లాలో ఇలా...

జిల్లాలో తాజాగా 13,35,202 జనాభా ఉండగా 12,92,930 నమోదయ్యారు. వీటిలో ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయా గ్రామాల్లో 12,45,402 మందిని సర్వే నిర్వహించారు. అంటే జిల్లాలో దాదాపు 93.27శాతం సర్వే నిర్వహించారు. వీటిలో మధుమేహం లక్షణాలు ఉన్న వారు 44,201మంది ఉన్నారు. అధిక రక్తపోటు ఉన్నవారు 63,514మంది ఉన్నారు. జిల్లా జనాభాలో 10.23శాతం మధుమేహం ఉన్నవారు ఉండగా, 13.55శాతం మంది రక్తపోటు ఉన్నవారున్నట్లు గుర్తించారు. మధుమేహ వ్యాధిగ్రస్తులు సాధారణంగా నిత్యం ఒకే తరహా మాత్రలు వేసుకుంటున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెట్‌పార్మిన్, గ్లిబెన్‌క్లామిడ్ మాత్రలు ఇస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 30పీహెచ్‌సీలు, 247 ఆరోగ్య ఉపకేంద్రాల్లో వేలాదిమంది రోగులు నెలకోమారు మందులు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ఆస్పత్రిలో ప్రత్యేకంగా ఎన్‌సీడీ విభాగాన్ని కూడా ఏర్పాటు చేసి నిత్య సేవలను అందిస్తున్నారు. దీనిలో దాదాపు జిల్లా ఇతర ప్రాంతాలనుంచి నెలకు 10వేల మందికి పైగా నిత్యం మందులు వినియోగించేవారు వస్తున్నారు. వీరిలో 40ఏళ్లలోపు వారు కూడా ఉండడం ఆందోళన కలిగిస్తున్న విషయం.

సూచనలు పాటించాల్సిందే,

డాక్టర్ సునిల్ కిలారు, షుగర్‌వ్యాధి నిపుణులు, ఖమ్మం

ఈ వ్యాధి లక్షణాలు కనిపించే వ్యక్తి నీరసంగా, పాలిపోయినట్టు కనిపిస్తుంటారు. ఎక్కువగా అలసటకు గురవుతారు. నీళ్ల తాగుతూ మూత్రానికి ఎక్కువసార్లు వెళ్తుంటారు. వైద్యుల సూచనలు తీసుకుంటూ మందులను క్రమం తప్పకుండా తీసుకుంటే ఇన్సులిన్ ఉపయోగించకుండా వ్యాధిని దూరం చేసుకోవచ్చు.

మధుమేహం బారిన పడేవారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. నేడు అందుబాటులోకి రోగ నిరోధకమాత్రలు ఎన్నో వచ్చాయి. దీని బారిన పడినా రోజుకు 12గంటలు శ్రమిస్తు తమ లక్ష్యాన్ని సాధిస్తున్నారనే విషయాన్ని తెలుసుకోవాలి. ఆహార నియమాలు పాటించాలి. పీచు పదార్థాలు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకుంటూ తగిన వ్యాయామం చేయాలి. యోగా, నడక క్రమం తప్పకుండా చేస్తుంటే మంచి ప్రయోజనం ఉంటుంది.

ఒత్తిడిలేని బాల్యానిద్దాం

నేడు జాతీయ బాలల దినోత్సవం



ఖమ్మం ఖానాపురంహవేలి నవంబరు 13(ఆంధ్రజ్యోతి): భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి (నవంబరు 14) సందర్భంగా బాలల దినోత్సవాన్ని జరుపుకొంటాం. బాలలకు ప్రేమను, సంరక్షణను, నాణ్యమైన విద్యను అందించటమే ఈ బాలల దినోత్సవ ముఖ్య ఉద్దేశం. బాలల హక్కుల గురించి ప్రజల్లో అవగాహన కలిగించి, పిల్లలు తమ భావాలను సమాచారాన్ని పంచుకోవడాన్ని, పరస్పర అవగాహనను పెంచుకోవాలన్న ఉద్దేశంతో ఈ బాలల దినోత్సవాలు నిర్వహిస్తుంటాం. నేటి బాలలే.. రేపటి పౌరులు. రేపటి తరాన్ని కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. తమ బాల్యాన్ని ఆనందంగా గడిపేలా వారిలో ఉత్సాహాన్ని నింపాలి. ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి. సరిగ్గా ఇవే ఆలోచనలు ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూకు ఉండేది. చిన్నారులు కనిపిస్తే వారిని దగ్గరకు పిలిచి గులాబీ ఇచ్చే వారు. చిరునవ్వులు చిందించేవారు. ఆయన 1889 నవంబరు 14న జన్మించారు. ఆయన పుట్టినరోజున ఏటా మనం బాలల దినోత్సవం జరుపుకొంటున్నాం.గురువారం ఆయన జయంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. పాఠశాలలో ఆయన జీవిత విశేషాలను విద్యార్థులకు వివరిస్తారు. బాలలను ఆనందంగా చదువుకోనిచ్చి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దటంలో ప్రతి ఒక్కరు కృషి చేయాల్సి ఉంటుంది. అందుకు ముఖ్యంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి ఎంతో అవసరం.

సైన్స్‌ఫెయిర్‌తో బాలల మెదడుకు పదును

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రతి ఏటా నిర్వహించే సైన్స్‌ఫెయిర్లతో బాలల మెదడుకు పదును పెట్టేందుకు నూతన ఆవిష్కరణలు కనిపెట్టేందుకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. విద్యార్థులు కొత్త కొత్త ప్రాజెక్టులు తయారు చేసి అబ్బురపరుస్తున్నారు. చిన్న వయసులోనే సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని బాల శాస్త్రవేత్తలవతున్నారు. పాఠశాలల యాజమాన్యాలు బాలల దినోత్సవానికి ఏర్పాట్లు సిద్ధం చేశాయి. .

జైలు జీవితంలా విద్యావ్యవస్థ..

ప్రతి ఒక్కరి జీవితంలో బాల్యం అమూల్యం. సంతోషాలమయం. అలాంటి అపురూపమైన బాల్యంపై ఒత్తిడి లేకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలు, ఉపాధ్యాయులపై ఎంతైనా ఉంది. ప్రస్తుత సమాజంలో విద్యావ్యవస్థ జైలు జీవితంలా మారింది. బండెడు సిలబస్‌ను పిల్లలపై రుద్దేలా వ్యవస్థ ఉంది. ఇలాంటి సందర్భంగా పసి మనసులకు కాస్త ఆహ్లాదాన్ని అందించాలి. తోటి పిల్లలతో ఆడుకోవడానికి అవకాశం ఇవ్వాలి. ఒత్తిడికి గురవుతుంటే గమనించి వారికి ఊరటనివ్వాలి. ఇరుగు పొరుగు పిల్లలతో ఆడుకోవడమూ ముఖ్యమే. ఆ ప్రాయంలోనే వారిలోస్నేహం అనే భావన చిగురిస్తుంది.

అలాగే.. పిల్లల ఆత్మహత్యలు రోజు రోజుకీ పెరుగుతూనే ఉన్నాయి. టెక్నాలజీ పరంగా దూసుకుపోతున్నాం.. చంద్రుడిపై జెండాపాతాం.. కానీ పిల్లల ఆత్మహత్యల విషయంలో ఏమీ చేయలేకపోతున్నాం..! ఇంకా ఘోరమైన విషయం ఏమిటంటే.. పిల్లలు మానసికంగా దృఢంగా ఉండాలి.. ఆటపాటలలో సత్తాచాటాలి అని చెబుతారు.. కానీ ఎన్ని స్కూళ్లలో పిల్లల కోసం ఆటస్థలం ఉందో ప్రశ్నించుకోండి. ఒకవేళ ఉన్నా ఆటలకు ఎంత సమయం కేటాయిస్తున్నారో ఆలోచించండి.

సెల్‌ఫోన్ మాయలో పడి చిన్నతనం నుంచే ఆటపాటలకు దూరమవుతున్నారు.. అనారోగ్యాలకు, బద్ధకానికి, చెడు అలవాట్లకు దగ్గరవుతున్నారు. ప్రకృతితో స్నేహాన్ని పెంచుకోండి.. అమూల్యమైన బాల్యాన్ని అందమైన జ్ఞాపకంగా మలుచుకోండి.

ఇసుక ర్యాంపులను పరిశీలించిన ట్రైకార్ జీఎం

దుమ్ముగూడెం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ మహిళల ఆర్థిక స్వయం సమృద్ధి సాధన దిశగా గిరిజన సంక్షేమశాఖ ద్వారా ఇసుక ర్యాంపులను కేటాయించామని ట్రైకార్ జీఎం శంకర్రావు అన్నారు. దుమ్ముగూడెం మండలం నందులచెలక, చర్ల మండలం పెద్దపల్లి ఇసుక ర్యాంపులను బుధవారం గిరిజన సంక్షేమశాఖ, మైనింగ్ అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆదివాసీ మహిళలు సొంతంగా ఇసుక ర్యాంపులు నడుపుకొని ఉపాధి అవకాశాలు పొందాలన్నారు. ఇసుక ర్యాంపుల నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యల్ని సొసైటీ మహిళల నుంచి అడిగి తెలుసుకున్నారు. సొసైటీల్లో బినామీలకు అవకాశం ఇవ్వొద్దని సూచించారు. ఇసుక సరఫరాకు సంబంధించిన ప్రతీ ఒక్క విషయాన్ని రిజిష్టర్‌లో నమోదు చేయాలన్నారు. ర్యాంపుల నిర్వహణ ద్వారా ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. ఐటీడీఏ ఏవో రాంబాబు, డీఎస్‌వో ప్రభాకర్‌రావు, జీఎం ఎల్లయ్య, టీఎస్‌ఎండీసీ పీఎంవో శంకర్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ గుడి

- అన్నదానం టోకెన్లు, ప్రొటోకాల్ దర్శనం, వస్త్రాల సమర్పణలో అమలు
- ప్రారంభించిన ఎమ్మెల్యే వెంకట్రావు, ఈవో రమాదేవి
- రాష్ట్రంలోనే డిజిటల్ సేవలు అమలు చేస్తున్న తొలి దేవస్థానంగా ఖ్యాతి



డిజిటలైజేషన్‌ను ఎమ్మెల్యేకు వివరిస్తున్న సిబ్బంది

భద్రాచలం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): భద్రాచల శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయంలో బుధవారం నుంచి డిజిటల్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. అన్నదానం టోకెన్లు, ప్రొటోకాల్ దర్శనం, వస్త్రాల సమర్పణలోనూ ఇక నుంచి డిజిటల్ విధానంలో భక్తులకు సేవలందించనున్నారు. ఈ సేవలను భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, దేవస్థానం ఈవోగా ఎల్.రమాదేవిలు లాంచనంగా ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమాన్ని పురస్కరించుకొని ముందుగా శ్రీసీతారామచంద్రస్వామి వారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అన్నదానం టోకెన్ల జారీ, ప్రొటోకాల్ దర్శనం, వస్త్ర సమర్పణ సమయంలో ఉపయోగించే విధంగా ఎడ్లపల్లికి చెందిన ఆత్రే ఇన్ఫోటెక్ సిస్టమ్స్ సంస్థ వారు ఆలయంలో డిజిటల్ సేవల సాఫ్ట్‌వేర్‌ను రూపకల్పన చేశారు. ఈ సేవలు బుధవారం నుంచి భక్తులకు అందుబాటులోకి వచ్చాయి.

పారదర్శకతే లక్ష్యంగా..

స్వామివారి అన్నదానం స్వీకరించే భక్తులు ఇకపై ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు వారి వివరాలు నమోదు చేసి భక్తుల ఫొటోలతో టోకెన్లు జారీ చేయనున్నారు. ఈ టోకెన్లను అన్నప్రసాద కేంద్రంలో చూపిస్తేవారు స్కాన్ చేసి లోపలికి అనుమతిస్తున్నారు. అలాగే ప్రొటోకాల్ దర్శనం కావాల్సిన భక్తులు ప్రొటోకాల్ కార్యాలయంలో డిజిటల్ సేవల ద్వారా వివరాలను నమోదు చేసుకొని దేవస్థానం ఇచ్చే ప్రొటోకాల్ దర్శన్ యాక్సిస్ కార్డు ద్వారా స్వామివారిని దర్శించుకుంటున్నారు. అదేవిధంగా స్వామివారికి భక్తులు సమర్పించే వివిధ వస్త్రాల సమాచారాన్ని బార్‌కోడ్‌లో నిక్షిప్తం చేసి స్వీకరించడం జరుగుతుంది.

భక్తులకు ప్రతి నిత్యం రామాలయంలో జరిగే సేవలను పూర్తిగా ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తేవడం ద్వారా రాష్ట్రంలోనే ఈ స్థాయిలో సాంకేతికను ఉపయోగించి సేవలందించే తొలి దేవస్థానంగా భద్రాద్రికి ఖ్యాతి దక్కింది. అన్నదానం టోకెన్లను ఫొటోలతో జారీచేయడం, భక్తులు సమర్పించే సమాచారం బార్‌కోడ్‌లో నిక్షిప్తం చేయడం భద్రాద్రిలోనే తొలిసారి ప్రవేశపెట్టారు. దేవస్థానం ఈవో రమాదేవి గతంలో సైతం భక్తులు స్వామివారికి సమర్పించే వెండి, బంగారు ఆభరణాలను వారు అందజేసిన వారికి ఆన్‌లైన్‌లోనే రశీదు జారీ చేసి ఆ రశీదుపై వారు అందజేసిన ఆభరణం ఉండేవిధంగా జారీచేసే విధానం ప్రవేశపెట్టారు. ఈ విధానం ప్రవేశపెట్టిన ఈవో రమాదేవిని దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖతో పాటు ఉన్నతాధికారులు ప్రశంసించడంతో పాటు ఇతర దేవస్థానాల్లో సైతం దీన్ని అమలు చేయాలని ఆదేశించారు.





హైదరాబాద్‌లో ఘనంగా శ్రీకవిత, మోహ్నిష్‌ల వివాహవేడుక

ఖమ్మం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఖమ్మానికి చెందిన శ్రీకవిత విద్యాసంస్థల అధినేత పారుపల్లి ఉషాకిరణ్‌కుమార్, విజయలక్ష్మి దంపతుల కుమార్తె శ్రీకవిత వివాహవేడుక బుధవారం రాత్రి హైదరాబాద్ గచ్చిబౌలిలోని అన్వయ కన్వెన్షన్‌లో ఘనంగా జరిగింది. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీఆర్‌ఎస్ రాజ్యసభ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీలు దగ్గుపాటి వెంకటేశ్వరరావు, నామ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కొండబాల కోటేశ్వరరావు, సినీ హాస్యనటుడు బ్రహ్మానందం, మాజీ మంత్రులు జగదీష్‌రెడ్డి, పువ్వాడ అజయ్‌కుమార్ తదితరులు తరలి వచ్చి వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

విషాదాంతమైన సహజీవనం

(5వ పేజీ తరువాయి)

పెట్టుకుంది. తన తండ్రి సింగరేణిలో ఉద్యోగం చేస్తున్నాడని, అందులో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రత్నకుమార్ నుంచి రూ.15 లక్షల నగదు, బంగారం తీసుకొంది. తరువాత నందినిని హత్య చేయించేందుకు రత్నకుమార్‌తో కుట్ర పన్నింది. ఈ ఏడాది సెప్టెంబర్ 29న నందిని ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో రత్నకుమార్ వెళ్లి దాడి చేయగా ఆమె గాయపడింది. దీంతో తన భర్త భద్రం, స్వాతి కలిసి తనను చంపేందుకు మరో వ్యక్తితో దాడి చేయించారని నందిని జూలూరుపాడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి నుంచి నందిని తన తల్లిగారి ఇంటి వద్దనే ఉంటుండగా భద్రం, స్వాతి కలిసి ఉంటున్నారు. అయితే నందినిపై దాడి విషయం బయటికి వస్తుందన్న భయంతో పాటు, ఉద్యోగం కోసం డబ్బులు చెల్లించి అప్పుల కావడంతో రత్నకుమార్, అతడి భార్య పార్వతి సెప్టెంబరు 30వ తేదీన కొత్తగూడెంలో పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. స్వాతి నమ్మించి డబ్బులు తీసుకొని మోసం చేయడంతో తన కుమారుడు, కోడలు ఆత్మహత్య చేసుకున్నారని రత్నకుమార్ కుటుంబ సభ్యులు చుంచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అటు నందినిపై దాడి కేసు, ఇటు రత్నకుమార్ దంపతుల ఆత్మహత్య కేసుల్లో స్వాతి విచారణ ఎదుర్కొంటోంది. తాను రత్నకుమార్‌నుంచి రూ.8 లక్షలు తీసుకున్నానని, అందులో రూ.2 లక్షలు తన ప్రియుడు భద్రంకు ఇచ్చినట్లు స్వాతి పోలీసుల ముందు అంగీకరించింది. ఈ క్రమంలో స్వాతి తాను ఇచ్చిన రెండు లక్షలు ఇవ్వాలని ప్రియుడు భద్రంను అడిగింది. దీంతో ఇద్దరి మధ్య వివాదం తలెత్తడంతో స్వాతి 15 రోజుల క్రితం పురుగుల మందు తాగింది. అయితే ప్రాణాపాయం నుంచి బయటపడింది.

అన్నింటికీ స్వాతియే కారణమని..

తాను ఎదుర్కొంటున్న అన్ని సమస్యలకు ప్రియురాలు స్వాతియే కారణమని భద్రం భావించాడు. ఆమెను ఎలాగైనా వదిలించుకోవాలని పథకం పన్నాడు. ఈ నెల 9న ఇంట్లో స్వాతితో కలిసివున్న సమయంలో పక్కా ప్లాన్ ప్రకారం ఆమె తలపై కత్తితో దాడి చేశాడు. తీవ్రగాయాలకు గురైన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం తన తల్లి సరోజ సహాయంతో మృతదేహాన్ని అదేరోజు రాత్రి గోనెసంచిలో పెట్టి తన పత్తి చేనులో పూడ్చి పెట్టాడు. అయితే కేసుల విచారణ నిమిత్తం స్వాతిని తీసుకురావాలని పోలీసులు భద్రానికి సమాచారం అందించారు. దీంతో భద్రం పోలీసుల వద్దకు వెళ్లి మూడు రోజుల నుంచి స్వాతి కనిపించడం లేదని, ఇంట్లో నుంచి వెళ్లిపోయిందని తెలిపాడు. అనుమానం వచ్చిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా తానే స్వాతిని చంపి తన పత్తి పొలంలో పూడ్చి పెట్టినట్లు అంగీకరించాడు.

శవాన్ని వెలికి తీసి.. పోస్టుమార్టం

భద్రమే తన ప్రియురాలిని హత్య చేసినట్లు అంగీకరించడంతో బుధవారం కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహ్మాన్, జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్‌ఐ రాణాప్రతాప్ మాచినేనిపేటతండాలో పత్తి పొలంలో పాతిపెట్టిన స్వాతి మృతదేహాన్ని వెలికితీయించారు. తహసీల్దార్ స్వాతిబిందు సమక్షంలో పంచనామ నిర్వహించి అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. స్వాతి చనిపోయిందన్న సమాచారం ఆమె బంధువులకు అందించగా, స్వాతి తల్లిదండ్రులు ఎప్పుడో చనిపోయారని, ఆమెతో తమకు ఎలాంటి సంబంధాలు లేవని తెలిపారని సీఐ వెల్లడించారు. రెండు రోజుల పాటు మార్చురీలోనే స్వాతి మృతదేహాన్ని ఉంచుతామని బంధువులు వస్తే అప్పగిస్తామని, లేదంటే మునిపిపాలిటీకి అప్పగిస్తామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి బి.జ్యోతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

దేశంలోనే అత్యధికంగా..

తెలంగాణ పామాయిల్ ఓఈఆర్

- 2024-25 సంవత్సరానికి రూ.19.42 ఓఈఆర్
- టన్ను ఒక్కంటికి రూ.160చొప్పున పెరుగుదల



వినతిపత్రం సమర్పిస్తున్న ఆయిల్‌ఫెడ్ చైర్మన్ తదితరులు

అశ్వారావుపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మొట్టమొదటిసారిగ దేశంలోనే తెలంగాణ ఆయిల్‌ఫెడ్ 2024-25 సంవత్సరానికి గాను అత్యధికంగా 19.42శాతం ఓఈఆర్ (నూనె దిగుమతి శాతం)ను ప్రకటించింది. ఇది పామాయిల్ చరిత్రలోనే అత్యధికం. బుధవారం హైదరాబాదులో సమావేశమైన హార్టికల్చర్ ఏసీ రఘునందనరావు, హార్టికల్చర్ జేడీ సరోజని, ఆయిల్‌ఫెడ్ ఎండీ యాస్మిన్‌భాష, ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగ రాఘవరెడ్డి, ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి,టీఎస్ ఆయిల్‌పామ్ రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఆలపాటి రామచంద్రరావు, కోటగిరి సీతారామస్వామి, ఉపాధ్యక్షులు సోమిరెడ్డి, బండి భాస్కర్‌రావు తదితరులుతో జరిగిన సమావేశంలో 2024-25 సంవత్సరానికి తెలంగాణ పామాయిల్ నూనె దిగుమతి శాతం(ఓఈఆర్)ను నిర్ధారిస్తూ ఉత్తర్వులు జారీ చేసారు. ఈ మేరకు రైతు సంఘ నాయకులు ఈ విషయాన్ని వెల్లడించారు.

ఓఈఆర్ పెరుగుదల పట్ల హర్షం..

టీఎస్ ఆయిల్‌పామ్ రైతు సంఘం నాయకుల కృషితో ఓఈఆర్ నిర్ణయంలో ఎదురైన అనేక ఆటంకాలను అధిగమించి మంచి శాతాన్ని రాబట్టిగలిగినట్టు పలువురు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది 19.17 శాతంగా ఉన్న పామాయిల్ ఓఈఆర్ శాతంను ఈ ఏడాది 19.42శాతంకు పెరిగింది. దీనిని ప్రకటించకుండా ఉండేందుకు ఆల్ ఇండియా ప్రైవేటు ఫ్యాక్టరీస్ అసోసియేషన్ అభ్యంతరం వ్యక్తం చేసింది. తెలంగాణాలోని ఆయిల్‌ఫెడ్ ఫ్యాక్టరీలలో వచ్చిన ఆయిల్ దిగుబడిలను బట్టి కాకుండా గత రెండేళ్ల సరాసరి ఆధారంగా ఓఈఆర్‌ను ప్రకటించాలని ప్రభుత్వానికి లేఖ రాసారు. దీనిని పసిగట్టిన టీఎస్ ఆయిల్‌పామ్ రైతు సంఘం ముందుగానే వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. అనంతరం ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డితో కలసి వెళ్లి సంబంధిత అధికారులను కలసి తెలంగాణ ఆయిల్‌ఫెడ్ ఫ్యాక్టరీలో వచ్చిన ఆయిల్ దిగుబడి ఆధారంగానే ఓఈఆర్‌ను ప్రకటించాలని కోరారు. బుధవారం హైదరాబాదులో జరిగిన సమావేశంలో రైతుల మనవిని పరిశీలించిన అధికారుల బృందం 19.42శాతం ఓఈఆర్‌ను ఖరారు చేస్తున్నట్టు ప్రకటించారు.

'ఉపాధి హామీ'లో లక్ష రూపాయల రికవరీ

- పనుల నిర్వహణలో అధికారుల బాధ్యతారాహిత్యం
- ఎఫ్‌ఏ సంతకం లేకుండానే మస్టర్లను ఆమోదించిన కార్యదర్శి
- 15వ సామాజిక తనిఖీలో బహిర్గతం



నాగులవంచ కార్యదర్శి, ఎఫ్‌ఏను విచారిస్తున్న ఏపీడీ

చింతకాని, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకంలో క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణలోపం, పనులు, రికార్డుల నిర్వహణలోపం ఉపాధిహామీ సామాజిక తనిఖీలో బహిర్గతమైంది. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధిహామీ 15వ సామాజిక తనిఖీ నిర్వహించారు. మార్చి 2023 నుంచి ఏప్రిల్ 2024 వరకు మండల పరిధిలోని 26 గ్రామ పంచాయతీల్లో 704 ఈజీఎస్ పనులకు సంబంధించి మొత్తం రూ 5,61,45874 నిధులు మంజూరవ్వగా కూలీలకు రూ 5,39,60,828, మెటీరియల్ కాంపోనెంట్ రూ 21,85,828 చెల్లించారు. పంచాయతీరాజ్ విభాగంలో 136 పనులకు సంబంధించి మొత్తం రూ 3,89,91,300 మంజూరవ్వగా కూలీలకు రూ 33956, మెటీరియల్ కాంపోనెంట్ రూ 3,89,57,111 చెల్లించారు. మన ఊరు- మన బడి 15 పనులకు సంబంధించి రూ 71,18,970 నిధులు మంజూరవ్వగా కూలీలకు రూ 7705, మెటీరియల్ కాంపోనెంట్ సంబంధించి 71,11,265 చెల్లించారు. ఆర్‌పీలు నిర్వహించిన సామాజిక తనిఖీల్లో పలు గ్రామాల్లో సిటిజన్ చార్ట్ లేకపోవడం, ఉపాధిహామీ రికార్డుల నిర్వహణ సక్రమంగా లేవని వెల్లడించారు. నాగులవంచ గ్రామంలో ఉపాధిహామీ క్షేత్రసహాయకుని సంతకం లేకుండానే రూ 46 లక్షల పనులకు సంబంధించిన మస్టర్లను పంచాయతీ కార్యదర్శి, టీఏ, ఏపీవో ఆమోదించారన్నారు. ఖమ్మం పనులకు వెళ్లే ఓ మహిళకు ఉపాధి పనులకు వెళ్లకుండానే ఆమె పేరు మీద మస్టర్లు వేశారని, 279 పనిదినాలకు సంబంధించిన నగదును ఒకే కుటుంబానికి ఇచ్చారన్నారు. అధికారుల బాధ్యతరాహిత్యానికి సంబంధించి రూ 42 వేల పెనాలిటీతో పాటు రూ 60825 రికవరీ చేసినట్లు అడిషనల్ పీడీ బీ శిరీష తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామయ్య, డీపీవో టీ సక్రియ, ఏపీడీ శ్రీనివాసరావు, క్వాలిటీ కంట్రోల్ అధికారులు వీరయ్య, అభిలాష్, అంబుడ్స్‌మెన్ రమేష్, ఎస్‌ఆర్‌పీలు సాంబశివచారి, పవన్, యాదగిరి, ఏపీవో కోటయ్య పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై ప్రత్యేక శ్రద్ధ: సీఎస్

ఖమ్మం కలెక్టరేట్, నవంబర్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాల అమలుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. బుధవారం ఆమె సచివాలయం నుంచి రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులతో కలిసి ధాన్యం, పత్తి కొనుగోళ్ళు, సమగ్ర ఇంటింటి సర్వే, నర్సింగ్, పారా మెడికల్ కళాశాలల, గ్రూప్ -3 పరీక్షలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఖమ్మం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్లు శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి, సంబంధిత అధికారులతో కలిసి ఈ వీడియో సమావేశంలో పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా 324 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, 1.3 లక్షల మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యం కొనుగోలుకు ప్రత్యేకంగా సెంటర్లు ఏర్పాటుచేశామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలకు 2567 మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చిందని, నాణ్యత ప్రమాణాలు పరిశీలించి 918 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి నట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ గ్రూప్-3 పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్ లకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు తనిఖీ చేయాలని, అందుబాటులో ఉన్న పరికరాలు, ధాన్యం నాణ్యత, రవాణా, తదితర విషయాలను పరిశీలించి నివేదిక అందించాలని ఆదేశించారు. ఈ వీడియో సమావేశంలో డీఆర్డీవో సన్యాసయ్య, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్ పాల్గొన్నారు.

'గిరిజన' ఇంటి నిర్మాణానికి భూమి పూజ

భద్రాచలం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం ఐటీడీఏ ఆవరణలో గిరిజన మ్యూజియం ఆవరణలో గిరిజన సంప్రదాయ మట్టితో ఇంటి నిర్మాణ పనులకు బుధవారం భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ భూమి పూజ నిర్వహించి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఐటీడీఏ మ్యూజియం ఆవరణలో ముక్కోటి సమయానికి మట్టి ఇల్లు, చేపల చెరువు, వంట షెడ్డు నిర్మాణం పూర్తయ్యే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవలని, ముక్కోటికి వచ్చే పర్యాటకులు తప్పనిసరిగా మ్యూజియంకు వచ్చేలా ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీడీసీఎల్ ఎండి వరుణ్‌రెడ్డి, ట్రైకార్ జీఎం శంకర్‌రావు, డీడీ వెల్ఫేర్ అధికారిణి మణెమ్మ, ఈఈ తానాజీ, ఎస్వో భాస్కరన్ పాల్గొన్నారు.

ఆలయ నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

దుమ్ముగూడెం నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):దుమ్ముగూడెం ముత్యాలమ్మ ఆలయ నిధులను ప్రస్తుత కమిటీ వాళ్ల దుర్వినియోగం చేస్తున్నారని తహసీల్దార్ అశోక్‌కుమార్, సీఐ అశోక్‌లకు గ్రామస్థులు బుధవారం ఫిర్యాదు చేశారు. గత జాతరకు రూ.లక్షలాది ఆదాయం లభించగా, వాటికి సంబంధించి ఎటువంటి లెక్కలు చెప్పకుండా దుర్వినియోగం చేశారని ఆరోపించారు. అమ్మవారి బంగారం, వెండి నగలు ఎక్కడున్నాయో ఎవరికీ తెలవదని తెలిపారు. తాజా ఆలయ కమిటీ అధ్యక్షుడు కొంతకాలంగా ఎవరికీ కనబడకుండా తిరుగుతున్నారని, ప్రస్తుతం ఆలయాన్ని నిర్వహిస్తున్న ప్రధాన కార్యదర్శి బైరెడ్డి సతీష్ సైతం ఆలయ నిధులను దుర్వినియోగ పరుస్తున్నట్లు తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో మాజీ చైర్మన్ అల్లాడి భాస్కర్రావు, కత్రి శివకుమార్‌లాల్, కెల్లా శేఖర్, గడ్డం బాలాజీ, బైరెడ్డి జయవెంకటరమణ, సాగర్, లంకా ప్రసాదు తదితరులున్నారు.

బేతుపల్లి రెవెన్యూలో సర్వే పరిశీలన



బేతుపల్లిలో సమీక్షిస్తున్న ఆర్డీవో, సర్వే ఏడీ

సత్తుపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మండలం బేతుపల్లి రెవెన్యూ పరిధిలో 133సర్వే నంబర్‌లో కొద్ది రోజులుగా జరుగుతున్న సర్వేను సర్వే అండ్ ల్యాండ్ రికార్ట్స్ ఖమ్మం అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, కల్లూరు ఆర్డీవో ఎల్.రాజేందర్‌గౌడ్ బుధవారం పరిశీలించారు. 133సర్వే నంబర్‌లో 3090ఎకరాల విస్తీర్ణం కలిగిన భూమి ఖాస్ర పహనీ ప్రకారం ఉండాల్సి ఉంది. విస్తీర్ణానికి మించి రైతుల పేర్లు నమోదై ఉండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భూమిలేని వారికి టైటిల్ ఉండి భూమి స్వాధీనంలో ఉన్న వారికి హక్కులు కల్పించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఎంజాయ్‌మెంట్ సర్వేచేసి అర్హులైన రైతులకు రికార్డుల్లో నమోదు చేసి టైటిల్ అందజేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందులో భాగంగా ఎంజాయ్‌మెంట్ సర్వేకు కలెక్టర్ ఆదేశించారు. గత కొద్ది రోజులుగా జరుగుతున్న సర్వేను బుధవారం కల్లూరు ఆర్డీవో, ఖమ్మం ఎస్‌అండ్‌ఎల్ఆర్ ఏడీలు సర్వే పరిశీలించి సర్వే సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వెనుకకుంట చెరువు ముందు భూములు సాగు చేసుకుంటున్న రైతులకు హక్కులు కల్పించాలని రైతులు కోరారు. ఐదారు దశాబ్ధాల క్రితమే ఈ ప్రదేశంలో పట్టా భూములు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకుని సాగు చేసుకుంటున్నామని ఆర్డీవోకు వివరించారు. సర్వే సందర్భంగా రికార్డులు పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. పూర్తిస్థాయిలో సర్వే జరిపించి నివేదికను కలెక్టర్‌కు పంపిస్తామని ఆర్డీవో రైతులకు హామీ ఇచ్చారు.

రామయ్యను దర్శించుకున్న ఎస్సీ కమిషన్ చైర్మన్, సభ్యులు



రామాలయంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్, సభ్యులు

భద్రాచలం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారిని బుధవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యులు దర్శించుకున్నారు. వారికి ఆలయ ఈవో ఎల్.రమాదేవి, అర్చక స్వాములు స్వాగతం పలికారు. అనంతరం వారు ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అలాగే లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయం, శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆలయాలను దర్శించుకొని పూజలు నిర్వహించారు. అలాగే వారికి వేద పండితులు వేద ఆశీర్వచనం అందజేయగా దేవస్థానం తరపున పట్టు వస్త్రాలు, తీర్థ ప్రసాదాలను దేవస్థానం అధికారులు అందించారు.

జగన్మోహిని అలంకారంలో భద్రాద్రి రామయ్య



భద్రాచలం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో క్షీరాబ్ది ద్వాదశిని (చిలుకు ద్వాదశి)ని పురస్కరించుకొని భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామి జగన్మోహిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. బుధవారం రాత్రి జగన్మోహిని అలంకారంలో అందంగా అలంకరించి మేళతాళాలతో నిత్య కల్యాణ మండపానికి తీసుకొచ్చారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సమయంలో దేవస్థానం ఆస్థాన విద్వాంసులు భక్త రామదాసు, తూము నరసింహదాసు కీర్తనలను ఆలపిస్తుండగా అందుకు అనుగుణంగా ప్రత్యేక హారతులను సమర్పించారు. రాజాధి వాహనంపై స్వామి వారు జగన్మోహిని అలంకారంలో తిరువీధి సేవకు తరలి వెళ్లగా భక్తులు స్వామి వారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, వైదిక పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం రైతు దైన్యం



పాలేరు కొనుగోలుకేంద్రంలో ధాన్యం ఆరబెట్టిన ధాన్యం

- వేధిస్తున్న బస్తాల కొరత
- కొనుగోళ్లలో జాప్యంతో రైతుల అవస్థలు
- వాతావరణంలో మార్పులతో ప్రైవేటుకే రైతుల మొగ్గు

కూసుమంచి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ప్రక్రియ ఆలస్యం అవుతుండటంతో రైతులు అవస్థలు పడుతున్నారు. తేమ తగ్గేవరకు ఆరబోత, తూకం, సంచులు కొరత, ధాన్యం మిల్లులకు తరలింపు తదితర సమస్యలు ఎదురవుతున్నాయి. మరోవైపు వాతావరణంలో మార్పులతో ముంచుకొస్తున్న అకాల వర్షాలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. దీంతో తెలంగాణ ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామన్నా.. రైతులు ప్రైవేటుకే అమ్ముకునేందుకు మొగ్గుచూపుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 15రోజుల కిందటే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికీ మండలంలో మాత్రం గత 8తేదీనుంచి కొనుగోళ్లు ప్రారంభించారు. పాలేరు కొనుగోలు కేంద్రంలోమాత్రమే కొనుగోళ్లు సాగుతున్నాయి. మిగిలిన కేంద్రాల్లో నామమాత్రంగానే సాగుతున్నాయి. 15వేల క్వింటాళ్ల ధాన్యం వస్తాయని అంచనా వేస్తుండగా.. ఇప్పటివరకు కేవలం 2,068 క్వింటాలు మాత్రమే కొనుగోలు చేసినట్లు నిర్వహకులు తెలిపారు.

అడ్డంకిగా మారిన నిబంధనలు

కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వ నిబంధనలు అడ్డంకిగా మారాయి. దీంతో ఇప్పటికి సగానికిపైగా పచ్చి వడ్లను ప్రైవేటు వ్యాపారులకు విక్రయించుకున్నారు. కేంద్రానికి తీసుకవచ్చేధాన్యాన్ని తూకం వేయడానికి మ్యాచర్ రాకపోవడంతో రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. తేమశాతం 14 కంటే ఎక్కువగా ఉంటే ఆరబోయాల్సిందే. మరోవైపు ప్రతిరోజు మబ్బులు పడుతుండటంతో వర్షం ఎక్కడ పడుతుందోనని ఆందోళన చెందుతున్నారు. కేంద్రాల్లోకి తీసుకవచ్చిన ధాన్యాన్ని ఉదయాన్నే ఆరబోయడం, సాయంత్రానికి మళ్లీ కుప్పపోయాల్సి వస్తోంది. ఇవన్నీ తట్టుకోలేక 50శాతం మంది రైతులు పచ్చివడ్లనే దళారులకు విక్రయిస్తున్నారు.

ప్రభుత్వం మద్దతు ధర రూ.2320 ఉన్నప్పటికీ ప్రైవేటు వ్యాపారులు కళ్లాల్లోకి డైరెక్టుగా వచ్చి తూర్పారబట్టకుండా, ఆరబెట్టకుండానే క్వింటాల్ ధర రూ.2100కి పచ్చి వడ్లనే కొనుగోలు చేస్తున్నారు. ఆరబెట్టడానికి, తూర్పారపెట్టడానికి కూలీల ఖర్చు, ఆరబెడితే సుమారు 5కేజీలవరకు బరువు తగ్గడం, కేంద్రంలో ఆరబోసి ఆరేడు రోజులు వరకు కాపలా ఉంటూ వేచి చూడటం ఎందుకని రైతులు ఎక్కువగా దళారులకు తెగనమ్ముకుంటున్నారు. ప్రభుత్వం 500 బోనస్ ఇస్తామని చెప్పినప్పటికీ లెక్కచేయడం లేదు. అధికధర వస్తుందని కొద్దిమంది మాత్రం కేంద్రాలకు తెస్తున్నారు.

బోనస్‌పై అనుమానాలు

ప్రభుత్వం ఈసారి సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించింది. ఏవిధంగా చెల్లిస్తారో అనే దానిపై ప్రభుత్వం నుంచి క్లారిటీ లేకపోవడంతో రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ధాన్యాన్ని పొట్టు తొలగించి మైక్రోమీటర్ ద్వారా నిర్ధారించనున్నారు. 2.66 మి.మీ. ఉంటేనే సన్నవడ్లుగా నిర్ధారిస్తారు. అయితే ఇప్పటివరకు మైక్రోమీటర్లను కేంద్రాలకు పంపిణీ చేయలేదు. అదేవిధంగా కొన్ని కేంద్రాల్లో బస్తాలకొరత వేధిస్తోంది. పాలేరు కేంద్రంలో తెచ్చిన బస్తాలు అయిపోయాయని, మళ్లీ వస్తేనే కాంటాలు వేస్తామని నిర్వహకులు తెలిపారు.

వెంటనే కొనుగోలు చేయాలి
వెంకటనారాయణ, రైతు, పాలేరు



కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని ఎటువంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలి. ప్రభుత్వ నిబంధనలు అడ్డంకిగా మారాయి. తేమశాతం ఎక్కువగా ఉంటుందని పెండింగ్ పెడుతున్నారు. అసలే మబ్బులు పడుతున్నందున వర్షం వస్తే ఆగమవుతాం. నిబంధనలు లేకుండా కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి.

ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు
దర్గయ్య, ఐకేపీ డీపీఎం



కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తున్నాము. తేమశాతం రాగానే వెంటనే కాంటాలు వేసి మిల్లులకు ఎగుమతి చేస్తున్నాం. ప్రభుత్వ నిబంధనల మేరకు రైతులకు ఎటువంటి నష్టం రాకుండా ఇబ్బందులు తలెత్తకుండా చూస్తున్నాం.

త్వరలోనే గ్రానైట్ సమస్యల పరిష్కారం

మంత్రులు తుమ్మల, పొంగులేటి, ఎంపీ రఘురాంరెడ్డి



మంత్రి తుమ్మలకు వినతిపత్రం అందిస్తున్న యుగంధర్

ఖమ్మం ఖానాపురంహవేలి నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలోని గ్రానైట్ పరిశ్రమల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తాం. మైనింగ్ శాఖ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్ద ఉన్నందున ప్రస్తుతం ఇతర రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి బిజీగా ఉన్నందున ఎన్నికల అనంతరం అసోషియేషన్ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరిస్తామని వ్యవసాయ శాఖ మం త్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మం త్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర చిన్నతరహ పరిశ్రమల, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు సమక్షంలో గ్రానైట్ స్లాబ్ అసోషియేషన్ అధ్యక్షుడు పాటిబండ్ల యుగంధర్ మంత్రులను, ఎంపీని కలిసి సమస్యలపై వినతిపత్రం అం దించారు. గ్రానైట్ పరిశ్రమలకు రావాల్సిన స బ్సిడీలు, స్లాబ్ సిస్టం, క్వారీ లీజుల సరళీకృతం, తదితర అంశాలను పరిశీలించి పరిష్కరించాలని, లేని పక్షంలో ఖమ్మం జిల్లాకు ఉన్న ఏకైక పరిశ్రమ గ్రానైట్ పరిశ్రమ మనుగడ ప్రశ్నార్థకంగా మిగులుతుందని, ఆ పరిస్థితి రాకుండ గ్రానైట్ పరిశ్రమను ఆదుకోవాలని కోరారు.

ఆధునిక పద్ధతుల్లో అధిక మత్స్య దిగుబడులు

పాలేరు మత్స్య పరిశోధనాస్థానం సీనియర్ శాస్త్రవేత్త శ్యామ్‌ప్రసాద్

రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన మత్స్యకారులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ



మాట్లాడుతున్న శాస్త్రవేత్త శ్యామ్‌ప్రసాద్

కూసుమంచి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక పద్ధతుల్లో అధిక మత్స్య దిగుబడులు సాధించవచ్చని పాలేరు మత్స్య పరిశోధనా స్థానం సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. బుధవారం మత్స్యపరిశోధనాకేంద్రంలో రాజన్న సిరిసిల్లా జిల్లాకు చెందిన 22మంది ఔత్సాహికులకు మూడురోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో ప్రస్తుతం చేపలకు మంచి డిమాండ్ ఉందని తెలిపారు. ఈక్రమంలో ఔత్సాహికులు చేపల పెంపకాన్ని చేపట్టి అధిక దిగుబడులు సాధించడం ద్వారా లాభాలు ఆర్జించవచ్చని పేర్కొన్నారు. ప్రస్తుతం సాంకేతిక పద్ధతులు అవలంబించి చేపల పెంపకం చేపట్టవచ్చని పేర్కొన్నారు. ఈసందర్భంగా చేపల పెంపకానికి ఉపయోగించే మేత తయారీలో వాడే వివిధ రకాల ముడిపదార్థాల గురించి వివరించి క్షేత్రస్థాయిలో తయారు చేయించారు.

వరంగల్ జిల్లా మామునూరు కృషివిజ్ఞాన కేంద్రం సైంటిస్ట్ మాట్లాడుతూ తెలంగాణ జలాశయాల్లో చేపల పెంపకం చేపట్టడానికి దాడి, కంచెలలో, పంజరాలలో అనువుగా ఉంటాయని పేర్కొన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని చేపల పెంపకం చేపట్టాలని తెలిపారు. మత్స్యశాస్త్రవేత్త రవీందర్ మాట్లాడుతు చేపల పెంపకానికి ప్రభుత్వం చేయూతనిస్తుందన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

● **తహసీల్దార్ శ్రీనివాస్**

వైరా, నవంబరు13(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. వైరాలో గత మూడు రోజులుగా జరుగుతున్న తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలల భద్రాద్రి 10వ జోనల్‌స్థాయి క్రీడలు గురువారంతో ముగియనున్నాయి. మూడోరోజు విజేతలకు వైరా తహశీల్దార్ కేవి శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు. ముగింపు కార్యక్రమానికి డిప్యూటి సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ పాల్గొంటారని వైరా ప్రిన్సిపాల్ సమత తెలిపారు.

మూడో రోజు అండర్ 14విభాగంలో డిస్కస్ త్రోలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా పి కీర్తి(నేలకొండపల్లి), పి. సుప్రియ (ఇల్లందు), ఆర్. ప్రశాంతి (పాల్వంచ),హై జంప్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు ఎస్. భార్గవి (వైరా), జి. మంజని (కల్లూరు), మహాలక్ష్మి (ఇల్లెందు), 600మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, ద్వితీయ స్థానాలు టి. రెసోనా(వైరా), పి. స్రవంతి (కల్లూరు), జి. మంజని (కల్లూరు), టెన్నికాయిట్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాలు దానవాయిగూడెం, వైరా, చదరంగంలో ప్రథమ, ద్వితీయ బహుమతులు జి.హర్షిత (అడవిమల్లెల), ఎన్. షణ్ముక (ఎర్రుపాలెం), జే. శ్రీకళ (నేలకొండపల్లి), క్యారమ్స్ డబుల్స్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు టి. చైతన్య-విద్యశ్రీ (నేలకొండపల్లి), ఆర్. స్వర్ణ-మనస్వి శ్రీ. జ్యోష్న, జి. వెన్నెల- బి. ఉదయ్‌శ్రీ (టేకులపల్లి) గెలుచుకున్నారు.



ఖోఖో పోటీల్లో పాల్గొన్న క్రీడాకారిణులు

గిరిజన దంపతుల అపురూప దైవభక్తి

- కోటి రూపాయల వ్యయంతో శ్రీయంత్ర సహిత కాళేశ్వరస్వామి ఆలయ నిర్మాణం
- ఆకట్టుకుంటున్న 14 అడుగుల స్వామి విగ్రహం
- కార్తీక మాసంలో ఘనంగా కొనసాగుతున్న పూజలు

ఆదర్శంగా నిలుస్తున్న వినాయకపురం వాసులు భూక్య భిక్షం-మోతీ దంపతులు





ఆలయ ఆవరణలో ప్రతిష్ఠించిన భగీరథ విగ్రహం, అమ్మవారు, నంది విగ్రహాలు



ఆలయంలో ప్రతిష్ఠింపబడిన 14 అడుగుల కాళేశ్వరస్వామి ఏకశిల విగ్రహం

అశ్వారావుపేట, నవంబరు13(ఆంధ్రజ్యోతి): పూర్వకాలంలో ఆలయాలు నిర్మాణాలు, కవులు, రచయిత్రలు, కళాకారులను పెద్ద పెద్ద రాజులు పోషించేవారు. ఇప్పుడు రాజకరికాలు అంతరించిపోయాయి. ప్రజల విరాళాలతోనే ఆలయ నిర్మాణాలు తదితర కార్యక్రమాలు చేబడుతున్నారు. తాజాగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వారావుపేట మండలం, వినాయకపురంలో గిరిజనులైన భూక్యభిక్షం-మోతీ దంపతులు దాదాపు కోటి రూపాయలకు పైగా సొంత డబ్బులతో తెలంగాణలో అరుదైన ప్రత్యేకతలు ఉన్న శ్రీ యంత్ర సహిత కాళేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించడం విశేషం. ఆలయాన్ని ప్రతిష్ఠించి 10 సంవత్సరాలైన ఇంకా ఆలయ నిర్మాణాలు, ఉప ఆలయాలు, ఇతరత్రా సౌకర్యాలు ఏర్పాటు చేసేందుకు వారు భగీరథునిల ప్రయత్నం కొనసాగిస్తూనే ఉన్నారు.

14 అడుగుల ఏకశిల కాళేశ్వర స్వామి, 42 అడుగుల ఏకశిల ధ్వజస్తంభంతో నిర్మాణం..

వినాయకపురంలో భూక్య భిక్షం దంపతులు సొంత భూమిలో రూ.కోటికి పైగా సొంత నగదులతో రెండు అంతస్థులతో ఆలయాన్ని నిర్మించారు. ఈ ఆలయంలో కింది అంతస్థులో శ్రీ చక్రయంత్ర సహిత కాళేశ్వరస్వామి 14 అడుగుల ఎత్తున్న ఏకశిల విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. కింద అంతస్థులో స్వామివారి మొదలు భాగం కనిపిస్తుంది. రెండవ అంతస్థులో స్వామి వారి విగ్రహం భక్తులకు దర్శనమిచ్చేలా నిర్మించారు. ఆలయం ముందు భాగాన 42 అడుగుల ఏకశిల ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేశారు. 14 అడుగుల ఎత్తు, 25 అడుగుల పొడవున నంది విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆలయానికి తూర్పుభాగంలో 100 అడుగుల వెడల్పున కోనేరుని నిర్మించి అక్కడ మృత్యుంజయ స్వామి, భగీరథుడు, అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేశారు. గర్భగుడిలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ప్రధాన ఆలయం చుట్టు నవగ్రహాలు, యాగశాల, విఘ్నేశ్వరుడు, శ్రీ సీతారామచంద్రస్వామి, శ్రీరాజశ్యామల మాత, నాగేంద్రస్వామి ఆలయాలను ఉప ఆలయాలుగా నిర్మించారు. ఇన్ని ప్రత్యేకతలు ఉన్న ఆలయం తెలంగాణలోనే అనేక ప్రత్యేకతలను సంతరించుకున్న ఆలయంగా ప్రసిద్ధి చెందింది. ప్రతి కార్తీక మాసంలో పెద్ద ఎత్తున భక్తులు ఇక్కడ స్వామివారిని దర్శనం చేసుకుంటారు. ఓ పల్లెలో ఓ గిరిజనుడు భగీరథ ప్రయత్నంతో సొంత నిధులతో ఆలయం నిర్మించడం అందరిని ఆశ్చర్యచకితులను చేస్తుంది.

కార్తీక మాసంలో వైభవంగా పూజలు..

ఎన్నో ప్రత్యేకతలు కలిగిన ఈ ఆలయంలో కార్తీక మాసంలో ప్రతిరోజు ప్రత్యేక పూజలు జరుగుతాయి. భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామివారికి అభిషేకాలు, పూజలు, కార్తీక దీపాలను భక్తులు పెద్ద ఎత్తున వెలిగిస్తారు.



నాగమాత విగ్రహం వద్ద దాత భూక్య భిక్షం దంపతులు

వైరా రిజర్వాయర్‌లో రొయ్యపిల్లల విడుదల



రొయ్యపిల్లలు విడుదల చేస్తున్న దృశ్యం

వైరా, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వంపై ఆధారపడకుండా స్వయంగా వైరా మత్స్య పారిశ్రామిక సహకారసంఘం నిధులను సమకూర్చుకుని బుధవారం వైరా రిజర్వాయర్‌లో రొయ్య పిల్లలను విడుదల చేసింది. ఈ నేపథ్యంలో వైరా చేపల సొసైటీ పాలకవర్గం రూ.18లక్షల విలువైన 6వేల లీటర్ల రొయ్య పిల్లలను రిజర్వాయర్‌లో పోసింది. సొసైటీ అధ్యక్షుడు షేక్ రహీం, డైరెక్టర్లు మత్స్యకారులు, తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు చోరీ నిందితులకు రిమాండ్

రఘునాథపాలెం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను రిమాండ్ చేసినట్లు సీఐ షరీఫ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వడ్డకొండ శివసాయి, బెల్లి సందీప్ రాపర్తి బాబ్జి ముగ్గురు ఒకే వాహనంలో ప్రయాణిస్తూ అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని విచారణ చేశామని తెలి పారు. వారి వద్ద నుంచి అర తులం బంగారం, 21 తులాలు వెండి, ఆటో, ద్వి చక్రవాహనం సీజ్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ప్రకటించారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

బూర్గంపాడు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలో పదో తరగతి విద్యార్థిని అదృశ్యమైన ఈ ఘటనపై బూ ర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తాళ్లగొమ్మూరుకు చెందిన విద్యార్థిని(15) స్థానికంగా ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. విద్యార్థిని తండ్రి మంగళవారం ఉదయం పాఠశాల వద్ద దింపి వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. మధ్యాహ్నా సమయంలో విద్యార్థిని పాఠశాలకు హాజరు కాలేదని పాఠశాల ఉపాధ్యాయులు బాధిత తల్లితండ్రులకు సమాచారం అందించారు. దీంతో కుటుంబ సభ్యులు విద్యార్థిని కోసం బంధువులు, తెలిసిన వారి దగ్గర గాలించినా ఫలితం లేకపోవడంతో మంగళవారం రాత్రి సమయంలో విద్యార్థిని తల్లి నాగమణి ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో దివ్యాంగుడి మృతి

మణుగూరు టౌన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ దివ్యాంగుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని తోగ్గూడెం గ్రామంలోని సమ్మక్క సారక్క గుడి వద్ద జరిగింది. పినపాక మండలం ఉలవచెలక గ్రామానికి చెందిన మల్కం రామ్మోహన్ (40) కొంత కాలంగా మణుగూరు మండలంలోని తోగ్గూడెం గుడి వద్ద నివాసముంటూ జీవిస్తున్నాడు. అశ్వాపురం మండలం టీజీ కొత్తూరు గ్రామానికి వెళ్లి వస్తుండగా, జూలూరుపాడు మండలం నల్లబండబోడు గ్రామానికి చెందిన వజ్జా గోపి, మణుగూరు మండలం భావి కూనవరం గ్రామానికి చెందిన కారం రామకృష్ణ అనే ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వస్తూ తోగ్గూడెం వద్ద దివ్యాంగుడి బైక్‌ను ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో దివ్యాంగుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరద పరిహారం

ఇతర రుణాలకు సర్దుబాటు

- విషయం తెలియక కేఎంసీ చుట్టూ బాధితుల ప్రదక్షిణలు

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలోని రాపర్తినగర్ డివిజన్‌కు చెందిన బోడా ఛమన్ మున్నేరు వరద బాధిత కుటుంబం. ప్రభుత్వం ఆ కుటుంబానికి రూ.16,500 పరిహారం మంజూరు చేసింది. గత సెప్టెంబరు 12న స్థానిక ఎస్‌బీఐ నుంచి బాధిత కుటుంబానికి పరిహారం డబ్బులు బ్యాంకు ఖాతాకు చేరాయి. కానీ బాధిత కుటుంబ సభ్యులు సోమవారం వరకు రోజు ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయానికి ప్రదీక్షణలు చేస్తూనే ఉన్నారు. ఆన్‌లైన్‌లో పరిశీలన చేయిస్తూ కార్పొరేటర్‌తో సిఫార్సులు చేయిస్తూ అధికారులపై వత్తిడి పెంచారు. కానీ అధికారులు మాత్రం పరిహారం పంపిణీ చేసిన విషయాన్ని లబ్దిదారునికి వివరించలేకపోయారు. మున్నేరు వరదల్లో తీవ్రంగా నష్టపోయిన బాధిత కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం ముందుకు వచ్చి కేవలం వారం రోజులు లోపుగానే నిధులు మంజూరు చేసి బాధితుల బ్యాంకు ఖాతాలకు నిధులు మంజూరు జరిగాయి. కానీ ప్రభుత్వం పరిహారం అందించినా కానీ బాధితులకు సరైన సమాచారం అధికారులు ఇవ్వలేక పోవటంతో పరిహారం పొందిన వారు కూడా ప్రతి రోజు ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయాలకు స్థానిక కార్పొరేటర్లు, నాయకులను వెంట తీసుకొని వస్తున్నారు.

ఇతర రుణాలకు సర్దుబాటు...

మున్నేరు పరివాహక ప్రాంతంలో ముంపునకు గురైన వారిలో 90శాతం వరకు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారే ఉన్నారు. ఆయా బాధితులు ఏదో ఒక బ్యాంకు నుంచి ద్విచక్ర వాహనం, డ్వాక్ర రుణాలు వంటి సూక్ష్మ రుణాలను పొందిన వారే ఉన్నారు. పరిహారం డబ్బులు బాధితుల బ్యాంకు ఖాతాలో జమ కాగానే బ్యాంకర్లు ఆటోమెటిక్ రుణాల కటింగ్ విధానం ద్వారా ప్రభుత్వం పంపిణీ చేసిన రూ.16,500లో బ్యాంకులో బకాయిలు ఉన్న రుణాన్ని తీసుకుంటున్నారు. మున్నేరు వరద బాధితుల్లో ఎక్కువ మందికి బ్యాంకు సేవల నుంచి ఎస్ఎంఎస్ సౌకర్యం ఉన్నవారు తక్కువగా ఉంటున్నారు. దీంతో బ్యాంకులో డబ్బులు పడిన విషయం కానీ, తిరిగు రుణానికి బదలాయింపు జరిగిన సమాచారం కానీ బ్యాంకు ఖాతాదారులకు రావడం లేదు. దాంతో ప్రభుత్వం డబ్బులు మంజూరు చేసినా కూడా పరిహారం అందలేని బాధితులు రోజుకు 50మంది కేఎంసీ చుట్టూ ప్రదీక్షణలు చేస్తున్నారు.



మసీదు నిర్మాణానికి 500 బస్తాల సిమెంట్ వితరణ


చెక్‌ను అందజేస్తున్న వెంకటరమణ

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కుల మతాలకు అతీతంగా సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకొనే 44వ డివిజన్ కార్పొరేటర్ పాలేపు విజయవెంకటరమణ మరోసారి తన ఔనత్యాన్ని చాటుకున్నారు. స్థానికంగా నిర్మాణం జరుగుతున్న మసీదు బుధవారం స్లాబ్ జరగటంతో తన వంతు సహాయంగా 500 బస్తాల సిమెంట్‌ను వితరణగా అందించారు. బస్తాల విలువకు తగిన చెక్కును మసీదు కమిటీ సభ్యులు అబ్దుల్ రవూఫ్, షైమూద్, సర్ధార్, మోయిన్, షైబు, ఖలీల్, జానీ, హైమద్ నాయకులు పాల్గొన్నారు.

జిల్లా ఆసుపత్రిలో పార్కింగ్ అస్తవ్యస్తం

పట్టించుకోని అధికారులు

ఇబ్బందులు పడుతున్న రోగులు


జిల్లా జనరల్ ఆసుపత్రిలో అడ్డదిడ్డంగా ఉన్న వాహనాల పార్కింగ్

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వివిధ ప్రాంతాల నుంచి రోగులు, గర్భిణులు, చిన్నపిల్లలు చికిత్స కోసం వస్తుంటారు. ఆసుపత్రి భవనం ఎదుట లోపలికి వెళ్లాలంటే అష్టకష్టాలు పడాల్సిందు. అస్తవ్యస్తంగా ద్విచక్ర వాహనాలను అడ్డంగా పెడుతున్నారు. దీంతో అత్యవసర చికిత్సల కోసం వచ్చే గర్భిణీలు, చిన్న పిల్లలు, ఒక్కో సారి అంబులెన్స్‌లు ఈ ద్విచక్ర వాహనాల మధ్య నుంచి వెళ్లాలంటే ఇబ్బందిగా మారింది. చికిత్స కోసం వచ్చే రోగులతో ఆసుపత్రి ఆవరణం వాహనాలతో నిండిపోతోంది.

జిల్లా ప్రభుత్వాస్పత్రిలో పార్కింగ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. ఆసుపత్రికి వచ్చే వారు వాహనాలను ఎక్కడపడితే అక్కడ పార్క్ చేస్తుండటంతో ఆవరణమంతా గందరగోళంగా కనిపిస్తోంది. దీంతో ఆసుపత్రికి వచ్చే రోగులు ఇబ్బంది పడుతున్నారు. నిత్యం జిల్లా ఆసుపత్రికి 1,500 మంది నుంచి 2వేల వరకు వస్తున్నారు. వీరితో పాటు సహాయకులను కలుపుకుంటే నిత్యం వచ్చే 3 వేల మందితో రద్దీ ఉంటుంది. అయితే ద్విచక్ర వాహనదారులకు తోడు కార్లలో వచ్చే వారు పద్ధతి ప్రకారం కాకుండా ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేస్తుండడంతో రోగులు, సహాయకులు కూర్చోవడా నికి వీలులేకుండా పోతోంది.

ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్

జిల్లా ఆసుపత్రిలో పార్కింగ్ బాధ్యతలను దివ్యాంగులు నిర్వహిస్తున్నారు. పది మంది దివ్యాంగులు వాహనదారుల వద్ద నుంచి రుసుము వసూలు చేసుకుంటారు. వాహనదారులు మాత్రం తమ వాహనాలను క్రమపద్ధతిలో కాకుండా ఇష్టారాజ్యంగా పెట్టి వెళ్తుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ విధానాన్ని అందరూ దివ్యాంగులే కావడంతో వాహనదారులను వారించ లేకపోతున్నారు. దీంతో వారి మాట పట్టించుకోవట్లేదు. పార్కింగు కోసం ఆసుపత్రి ప్రధాన గేటు సమీపంలో స్థలం కేటాయించినా అక్కడ కాకుండా నేరుగా లోపలకు వచ్చి ఇష్టమున్న చోట వాహనాలు నిలుపుతు న్నారు. జనరల్ ఆసుపత్రి, మాతా శిశు సంరక్షణ కేంద్రం, టీబీ హాస్పిటల్, మార్చురీ, సఖీ కేంద్రం, ట్రామాకేర్ సెంటర్, ల్యాబ్, ఆస్పత్రి కార్యాలయం వద్ద రద్దీగా ఉంటోంది. ఫలితంగా వైద్యులు, ఇతర సిబ్బంది తమ వాహనాలను పెట్టుకోవడానికి కూడా స్థలం దొరక నానా అవస్థలు పడుతున్నారు. ఇ ప్పటికైనా పార్కింగ్‌ను క్రమబద్ధీకరించి ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలని పలువురు కోరుతున్నారు.

రోగులను ఆప్యాయంగా పలకరించాలి: డీఎంహెచ్‌వో


మామిళ్లగూడెం సబ్‌సెంటర్‌లో డీఎంహెచ్‌వో

ఖమ్మం కలెక్టరేట్/ఖమ్మం రూరల్ నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులను ఆప్యాయంగా పలకరించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి సూచించారు. బుధవారం ఆమె మామిళ్లగూడెం అర్బన్ హెల్త్ సెంటర్‌ను సందర్శించారు. పీహెచ్‌సీలో ఆరోగ్య సేవలను, ఫార్మసీ, ల్యాబ్, వాక్సిన్‌లను పరిశీలించారు. మాతా శిశు సంక్షేమం, అసంక్రమణ వ్యాధులు నియంత్రించే కార్యక్రమం, చిన్నపిల్లలు వ్యాధి నిరోధక టీకాలు కార్యక్రమాలను ప్రజలకు అందించాలన్నారు. అనంతరం ఏదులాపురం హెల్త్‌సబ్ సెంటర్, అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ జరుగుతున్న ఇమ్యూనైజేషన్ కార్యక్రమాన్ని పరిశీలించి, రిజిస్టర్లను తనిఖీ చేశారు.

గ్యాస్ వినియోగంపై విద్యార్థులకు అవగాహన

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎల్పీజీ గ్యాస్ వినియోగంలో మెళకువలు పాటిస్తే ప్రమాదాలను అరికట్టవచ్చని ఇండేన్ గ్యాస్ అధినేత ఎంవీ నగేష్ స్పష్టం చేశారు. బుధవారం నాగసాయి ఇండేన్ గ్యాస్, యోగానంద గ్యాస్ ఏజెన్సీ సంయుక్తంగా ఎల్పీజీ వినియోగంపై పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎల్పీజీ వినియోగం, భద్రత, తదితర అంశాలపై వివరించారు. ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రులకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. తద్వారా జిల్లాను ప్రమాదరహిత జిల్లాగా ఉంచాలని సూచించారు. షార్ట్ ఫిలిం ద్వారా అవగాహన కల్పించిన అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించి బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి సీతామహాలక్ష్మీ, గ్యాస్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

కూరగాయలు ధరలు
(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	38రూ.
వంకాయ	48
గుత్తి వంకాయ	50
బీరకాయ	50
పచ్చిమిర్చి	38
కాకరకాయ	28
బెండకాయ	30
పొట్లకాయ	40
దోసకాయ	38-68
నాటుచిక్కుడు	120
గోరుచిక్కుడు	58
క్యాబేజీ	38
దొండ	30-40
సొరకాయ	28
క్యారెట్	74
క్యాప్సికం	68
ఆలుగడ్డ	40
ఉల్లిగడ్డ	60-70
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	175
కొత్తిమీర కట్ట	40

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

సినిమా

నగరంలో చిత్రాలు..

వినోద:	లక్కీభాస్కర్
శ్రీనివాస:	అమరన్
సాయిరాం:	అపుడో ఇప్పుడో ఎపుడో
ఆదిత్య:	క
తిరుమల:	దేవర
సినీ గెలాక్సీ:	ధూంధాం

కుట్టు మిషన్ అందజేత

ఖమ్మం సాంస్కృతికం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నిరుపేద కుటుంబానికి ఖమ్మం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కుట్టుమిషన్ అందజేశారు. కూసుమంచి మండలం చేగొమ్మ గ్రామానికి చెందిన కుక్క నాగేంద్ర కూలి పనులు చేసుకుంటుండగా ఆమె భర్త వినోద్ ఆటో డ్రైవర్‌గా ఉన్నాడు. కడు పేద కుటుంబం కనుక వారికి కుట్టుమిషన్‌ను బుధవారం అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్ష , కార్యదర్శులు డాక్టర్ బొల్లి కొండ శ్రీనివాసరావు, గెల్లాశ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి: ఏఐపీకేఎస్

తిరుమలాయపాలెం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కలిపించడంలో పాలక ప్రభుత్వాలు విఫలం చెందాయని ఏఐపీకేఎస్ రాష్ట్ర నాయకులు గుర్రం అచ్చయ్య పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పాతర్లపాడు సమీపంలోని భాగ్యలక్ష్మి జిన్నింగ్‌మిల్లును సంఘం ప్రతినిధి బృంద సభ్యులు పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం అచ్చయ్య మాట్లాడుతూ నిబంధనలు లేకుండా పత్తిని సీసీఐ కొనుగోలు చేయాలన్నారు. క్వింటాకు రూ.10 వేలు మద్దతు ధర కలిపించాలన్నారు. కార్యక్రమంలో మలీదు నాగేశ్వరరావు, ఆవుల వెంకటేశ్వర్లు, కమ్మకోమటి నాగేశ్వరరావు, బందెల వెంకయ్య, ఆర్.శివలింగం, హనుమంతరావు, ఎస్.వెంకటేశ్వర్లు, నవీన్, పి.వెంకటస్వామి, మల్లయ్య పాల్గొన్నారు.

నగరంలో నత్తనడకన సమగ్ర సర్వే

కేఎంసీ పరిధిలో 2.89 శాతమే

ఖమ్మంలో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసిన ప్రత్యేక అధికారి రవికాంత్


సర్వే తీరును పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి రవికాంత్

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా వేగంగా జరుగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఖమ్మం నగర పాలక సంస్థ పరిదిలో మాత్రం నత్తనడకన కొనసాగుతుందని విమర్శలు వెలువడుతున్నాయి. జిల్లాలోనే అతి తక్కువగా రోజు వారీ సర్వే నమోదు కావటం సర్వే తీరును ప్రశ్నిస్తోంది. జిల్లా సగటు సర్వే 20.23 బుధవారం వరకు నమోదు జరిగింది. మండల స్థాయిలోను వేగంగా సర్వే జరుగుతోంది. సింగరేణి వంటి గిరిజన ప్రాంత మండలంలోను 38.84శాతం నమోదు కాగా ఖమ్మం నగర పాలక సంస్థలో మాత్రం కేవలం 2.89శాతమే నమోదు జరిగింది.

పరిశీలించిన ప్రత్యేక అధికారి రవికాంత్

ఖమ్మం నగర పాలక సంస్థలో సర్వే తీరును క్షేత్రస్థాయిలో సర్వే ప్రత్యేక అధికారి రవికాంత్ పరిశీలించారు. పలు డివిజన్లలో నేరుగా ఇంటింటి సర్వేలో పాల్గొన్నారు. ప్రజల నుంచి ఎటువంటి స్పొందన వస్తొందనే విషయాలను, సర్వేపై సమాదానాల సమయంలో ప్రజలకు భాషాపరంగా ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నరు. ప్రజలు ఇబ్బంది పడే విషయాలపై ఆరా తీశారు. ఖమ్మం నగరంలో మరింత పటిష్టంగా సర్వేకు పర్యవేక్షణ పెంచాలని కేఎంసీ అధికారులకు సూచించినట్లు సమాచారం.

లక్కీడ్రా విజేతలకు బహుమతుల ప్రదానం

ఖమ్మం ఖానాపురం హవేలీ నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ ఖమ్మం రీజియన్ పరిధిలో ఆగస్టు, సెప్టెంబరు నెలలో డీలక్స్ బస్సుల్లో ప్రయాణించిన మహిళలకు బుధవారం నగరంలోని నూతన బస్టాండ్‌లో లక్కీడ్రా నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమానికి ఆర్ఎం సరిరాం హజరై విజేతలైన 48 మందికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజనల్ (ఆపరేషన్) పవిత్ర, అసిస్టెంట్ మేనేజర్ రామయ్య, వివిద విభాగాల అధికారులు , మహిళలు పాల్గొన్నారు.

అన్నం సేవా సంస్థకు రూ.20వేల చెక్ అందజేత

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విద్యుత్ శాఖ(ఎస్పీడీసీఎల్) ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాల్లో భాగంగా ఖమ్మంలోని అన్నం ఫౌండేషన్ ఛైర్మన్ అన్నం శ్రీనివాసరావుకు రూ.20వేల చెక్కును అందించారు. బుధవారం అన్నం ఫౌండేషన్‌కు వెళ్లిన విద్యుత్‌శాఖ పర్యవేక్షణ ఇంజనీరింగ్ అధికారి సురేందర్, డీఈలు రాములు, బాబురావు ఆధ్వర్యంలో చెక్కును అందజేశారు.

బాధిత కుటుంబాలకు కందాళ పరామర్శ

నేలకొండపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి బుధవారం నేలకొండపల్లిలో పలు కుటుంబాలను పరామర్శించారు. ఈనెల 10న మృతి చెందిన మల్లారపు లక్ష్మీబాయి కుటుంబాన్ని పరామర్శించారు. కుమారులు మల్లారపు శ్రీను, నర్సింహారావులకు సానుభూతి తెలిపారు. పిట్టల మంగమ్మ కుటుంబాన్నిపరామర్శించి, కుటుంబానికి సానుభూతి తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న బీఆర్ఎస్ కార్మిక సంఘం నాయకుడు కాసాని నాగేశ్వరరావును పరామర్శించి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తెలుత వాసవీభవన్‌లో ఓ వివాహ కార్యక్రమానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఉన్నం బ్రహ్మయ్య, ఎండి.వాజీద్, షేక్.హుస్సేన్, కొండా కనకప్రసాద్, గొలుసు రవి తదితరులు ఉపేందర్‌రెడ్డి వెంట ఉన్నారు.

రాజేశ్వరపురంలో ఎడ్ల పందాల్లో అపశ్రుతి

● జనంపైకి దూసుకెళ్లిన ఎద్దు

● ఇరువురికి గాయాలు

నేలకొండపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని రాజేశ్వరపురం గ్రామంలో నిర్వహిస్తున్న ఒంగోలు జాతి ఎడ్ల పందాల్లో రెండవ రోజు అపశ్రుతి దొర్లింది. పోటీలో పాల్గొనటానికి తీసుకొచ్చిన ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడుకు చెందిన ఎడ్లను పోటీ ప్రదేశంలోని రింగులోకి తీసుకొచ్చి బండ కట్టే సమయంలో జనాన్ని చూసి బెదిరిన ఎడ్లు ఒక్కసారిగా జనంపైకి దూసుకెళ్లాయి. దీంతో పోటీలను తిలకించటానికి వచ్చిన జనం భయ భ్రాంతులకు గురై ఒక్కసారిగా చెల్లాచెదురుగా పరుగులు పెట్టారు. దీంతో గ్రామానికి చెందిన సుడిగాలి బాబు అనే వ్యక్తితో పాటుగా మూటాపురం గ్రామానికి చెందిన మరో వ్యక్తికి గాయాలైనాయి. అక్కడే ఉన్న సమోసాల బండిపైకి వెళ్లటంతో బండి పాడైపోయింది. కొన్ని ద్విచక్రవాహనాలు కిందపడిపోయాయి. వెంటనే స్పందించిన ఎడ్లకు చెందిన రౌతులు ఎడ్లను కట్టడి చేయటంతో పెను ప్రమాదం తప్పింది.

గాయపరిచిన కేసులో ఏడాది జైలు

ఖమ్మం లీగల్ నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిని గాయపరిచిన కేసులో తిరుమలాయపాలెం మండలం బచ్చోడు తండాకి చెందిన ధరావత్ చంద్రుకి ఏడాది జైలుశిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ ఖమ్మం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జికోర్టు న్యాయాధికారి కాసరగడ్డ దీప బుధవారం తీర్పుచెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున

ఏపీపీవో డి.వీరయ్య, లైజన్ ఆఫీసర్ కె.శ్రీకాంత్ హెడ్‌కానిస్టేబుల్ దొండపాటి నాగేశ్వరరావు, కోర్టు కానిస్టేబుల్ ఐ.పున్నయ్య సహకరించారు.

గుండెపోటుతో సీపీఐ సీనియర్ సభ్యురాలి మృతి

ఖమ్మం రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కామంచికల్లు గ్రామానికి చెందిన సీపీఐ సానుభూతి పరురాలు బొప్పి ముత్తమ్మ (65) గుండెపోటుతో బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ఆమె మృతదేహన్ని సందర్శించి నివాళుర్పించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు తాటి వెంకటేశ్వర్లు, గాంధీ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ వద్ద రెండు ద్విచక్రవాహనాల ఢీ

కూసుమంచి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కూసుమంచిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో పనిచేస్తున్న, గైగొళ్లపల్లి గ్రామానికి చెందిన వీరబాబుకు, గంగబండతండాకు చెందిన మరొకరికి గాయాలయ్యాయి. కూసుమంచి అదనపు ఎస్ఐ శ్రీధరాచారి సంఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వారికి చికిత్స అందజేస్తున్నారు.

ఖానాపురం శ్మశాన వాటిక స్థల ఆక్రమణపై పోలీసు విచారణ

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఖానాపురం శ్మశాన వాటిక కబ్జాపై బుధవా రం పోలీసు అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ఖమ్మం నగరంలోని టేకులపల్లి, లక్ష్మీనగరం, రోటరీనగర్, డబుల్ బెడ్‌రూమ్ ప్రాంత వాసులకు కోసం మూడు దశాబ్దాలుగా ఖానాపురం శ్మశాన వా టిక స్థలంలో అంత్యక్రియలు జరుగుతున్నాయి. ఈ క్ర మంలో కొంతమంది వ్యక్తులు శ్మశాన వాటిక స్థలాన్ని కబ్జా చేసి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారని ఆరోపిస్తూ పోలీసుస్టేషన్‌లో స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు విచారణ చేపట్టారు.

సైన్స్, ఇన్‌స్పైర్ జిల్లా సన్నాహక సమావేశం

ఖమ్మం ఖానాపురంహవేలి నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సైన్స్ ఇన్‌స్పైర్ జిల్లా సన్నాహక సమావేశం బుధవారం నగరంలోని పాత డీఈవో (సైన్స్ మ్యూజియం) కార్యాలయంలో నిర్వహించారు. నవంబరు 26, 27 తేదీలలో సైన్స్ ఇన్‌స్పైర్ నిర్వహించాలని నిర్ణయించి కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపించామని డీఈవో సోమశేఖర శర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు మెరుగైన ప్రదర్శనలుఅందించాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, అసోషియేషన్ బాధ్యులు, సైన్స్ జిల్లా బాధ్యులు, ఎంఈవోలు శైలజ, రాములు, పాల్గొన్నారు.

రైల్వే ప్లాట్‌ఫారంపై గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఖమ్మంక్రైం, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రైల్వే స్టేషన్‌లోని ఒకటో ప్లాట్‌ఫారంపై సుమారు 35 ఏళ్లున్న గుర్తుతెలియని వ్యక్తి బుధవారం సాయంత్రం మృతిచెందాడు. అది గమనించిన జీఆర్పీ పోలీసులు అన్నం శ్రీనివాసరావుకు సమాచారం అందించి ఆయన సహకారంతో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి మార్చురికి తరలించారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లబించలేదని రైల్వే పోలీసులు తెలిపారు.

మూడు రోజులు పత్తి కొనుగోళ్లు బంద్

నేలకొండపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ పరిధిలోని ముదిగొండ మండలం సువర్ణాపురం గ్రామంలోని ఉషశ్రీ జిన్నింగ్ మిల్లు నందు సీసీఐ వారు పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు ఏఎంసీ ఛైర్మన్ వెన్నపూసల సీతారాములు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 15వ తేదీ శుక్రవారం గురునానక్ జయంతి, 16వ తేదీ శనివారం వారాంతపు సెలవు, 17వ తేదీ ఆదివారం సెలవులుంటాయన్నారు. 18వ తేదీ సోమవారం నుంచి యథావిధిగా పత్తి కొనుగోళ్లు కొనసాగుతాయని ప్రకటనలో తెలిపారు.

సీపీఐ సభ్యత్వాల సేకరణ

ఖమ్మం రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిదిలోని పొన్నెకల్లు గ్రామంలో సీపీఐ సభ్యత్వాల సేకరణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. సీపీఐ జిల్లా సహయ కార్యదర్శి దండి సురేష్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కిషన్ రావు, రాము, నరేష్, కోటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రేపు మాలల ఆత్మీయ సమ్మేళనం

ఖమ్మంచర్చికాంపౌండ్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): నగరంలోని మమతారోడ్‌లోని ఈఆర్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం నిర్వహించే ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాటసమితి మాల మహానాడు ఆధ్వర్యంలో నిర్వహించే మాలల ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని పోరాట సమితి కో కన్వీనర్ పేరం మల్లయ్య కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కొట్టె సుధాకర్, కార్యదర్శి గుమ్మడి కనకరాజు, నాయకులు దామల సత్యం, కొరివి దయానంద్, భాస్కర్, పాగ యోనా తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి: అదనపు కలెక్టర్


తేమశాతాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

కూసుమంచి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలుళ్లలో వేగం పెంచాలని అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు.బుధవారం కూసుమంచి మండలం పాలేరు ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్వహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సరైన తేమశాతంతో వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి పంపించాలని ఆదేశించారు. కేంద్ర పరిధిలో కోతలు ఎప్పుడు పూర్తవుతాయని? రైతులు ప్రైవేటు మిల్లులు, కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలిస్తున్నారా? ఏప్రాంతంలో ధాన్యం ఎక్కువగా పండుతుంది అడిగి తెలుసుకున్నారు. చెత్త తాలు లేకుండా తూర్పారబెట్టిన ధాన్యాన్ని కేంద్రానికి తీసుకవచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని 24గంటల్లో మిల్లులకు పంపేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆయన వెంట జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్‌కుమార్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ శ్రీలత పలువురు అధికారులు పాల్గొన్నారు.

పేరు ఎలా వచ్చిందంటే..

బ్రాహ్మణ బజార్..



ఖమ్మం సాంస్కృతికం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలోని పురాతన వీధుల్లో బ్రాహ్మణ బజార్‌కు ప్రత్యేక చరిత్ర ఉంది.. ఈ ప్రాంతం ఏర్పడిన నాళ్లల్లో అధిక శాతం ప్రజలు బ్రాహ్మణులే కావటంతో ఆ పేరు స్థిర పడింది. ప్రస్తుతం ఇతర కులస్థులు, మతాల వారు సైతం నివాసాలు ఏర్పాటు చేసుకున్నప్పటికీ వీధి మాత్రం తన ప్రత్యేకతను కొనసాగిస్తోంది. విభిన్న మతాల వారు ఉన్నప్పటికీ స్థానికంగా మత సామరస్యం వెల్లి విరుస్తుండటం ఒకరి మతాచారాలను మరొకరు గౌరవించుకుంటున్నారు. ఈప్రాంతం ఒకప్పుడు అగ్రహారంగా వెలుగొందటంతో స్థానికంగా బ్రాహ్మణ కుటుంబాలు నివాసం ఏర్పాటు చేసుకున్నాయి. నగర వ్యాప్తంగా వివాహాలు, తదితర శుభ కార్యాలకు, పూజలను జరిపించే అయ్యవార్లు ఇక్కడినుంచే రాక పోకలు సాగిస్తుంటారు. కట్టుబొట్టు, వస్త్రధారణ తదితర ఆచారాలను పాటిస్తుండటంతో ఇప్పటికీ అగ్రహారాన్ని చూసిన అనుభూతి కలుగుతుంది.. స్థానిక భ్రమరాంబ సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయం (శివలాయం) నుంచి కోటమైసమ్మ గుడి వరకు బ్రాహ్మణ బజార్ తన ఉనికిని కలిగి ఉంది. ఈ శివాలయం అత్యంత ప్రాచీనమైంది కనుక నగర వ్యాప్తంగా భక్తులు సందర్శిస్తారు. శివరాత్రి, కార్తీక మాసం తదితర పర్వదినాల్లో ఈ వీధి ఇసుక వేస్తే రాలనంత రద్దీగా మారుతుంది.

గ్రామీణ క్రీడలను ప్రోత్సహించడం అభినందనీయం

మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ దయాకర్‌రెడ్డి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న దయాకర్‌రెడ్డి

నేలకొండపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అంతరించిపోతున్న గ్రామీణ క్రీడ కబడ్డీని ప్రోత్సహిస్తూ ప్రతి సంవత్సరం కార్తీక పౌర్ణమికి రాజేశ్వరపురంలో పోటీలను నిర్వహించటం ఎంతో అభినందనీయమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి అన్నారు. రాజేశ్వరపురంలో నిర్వహిస్తున్న అంతరాష్ట్ర కబడ్డీ పోటీలను ఆయన బుధవారం ప్రారంభించారు. కబడ్డీ పోటీలను నిర్వహిస్తూ కబడ్డీని ప్రోత్సహిస్తూ, కనుమరుగు గాకుండా చూడాలని దయాకర్‌రెడ్డి అన్నారు. క్రీడలు దేహదారుఢ్యాన్ని, ఆరోగ్యాన్ని పెంచటంతో పాటుగా క్రీడాకారుల మధ్య ఐక్యతను పెంపొందిస్తాయన్నారు. కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్న నిర్వాహకులను దయాకర్‌రెడ్డి అభినందించారు. అనంతరం ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్‌వెన్నపూసల సీతారాములు, మాజీ ఛైర్మన్ శాఖమూరి రమేష్, మాజీ సర్పంచ్ దండా పుల్లయ్య, నాయకులు నెల్లూరి భద్రయ్య, కొడాలి గోవిందరావు, యలమద్ది లెనిన్, దండా నర్సింహారావు, తాటికొండ రవి, వీరవెల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

త్రీఫేజ్ కరెంట్ ఇవ్వరూ..

» త్రీఫేజ్ కోసం బొట్లకుంట శివారు గ్రామస్థుల ఎదురుచూపులు

» నూతన 11 కేవీ విద్యుత్ లైన్ మంజూరు చేయాలని గ్రీవెన్స్‌లో వినతి



త్రీఫేజ్ విద్యుత్ కోసం గ్రామంలో సంతకాల సేకరణ చేపడుతున్న రైతులు(ఫైల్)

కొణిజర్ల, నవంబరు13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దగోపతి గ్రామ పంచాయతీ పరిధిలో బొట్లకుంట గ్రామం ఉంది. అక్కడ రైతులు ఎక్కువగా వ్యవసాయం పైనే ఆధారపడి జీవిస్తున్నారు. గ్రామానికి సింగిల్ ఫేజ్ వస్తున్నప్పటికీ, వ్యవసాయానికి త్రీఫేజ్ ఇవ్వడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్ ఉన్న గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న తమ గ్రామానికి ఎందుకు త్రీఫేజ్ ఇవ్వరని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. ఎన్నో ఏళ్లనాటి విద్యుత్‌లైన్ వేశారని, కాలక్రమేనా ఆ విద్యుత్ ఇనుప స్తంభాలు ప్రమాదాలకు నిలయంగా మారాయని చెబుతున్నారు. వాటిని మార్చి రోడ్డు పక్కనే కొత్తగా 11కేవీ లైన్ వేయాలని కోరుతున్నారు. ప్రస్తుతం ఉన్న విద్యుత్‌లైన్ చుట్టూ తోటలు ఉండటం వలన ఆ తోటలు పెద్ద పెద్ద మొక్కలుగా తయారుకావడంతో విద్యుత్‌కు కూడాఅంతరాయం ఏర్పడుతుందని వాపోతున్నారు. బొట్లకుంటకు పెద్దగోపతి నుంచి కాకుండా అమ్మపాలెం అనే గ్రామం ఫీడర్ నుంచి త్రీఫేజ్ ఇస్తున్నారు. అదే పెద్దగోపతి సబ్‌స్టేషన్ నుంచి కొత్తలైను వేస్తే తమకు కష్టాలు తొలుగుతాయని గ్రామస్థులు కోరుతున్నారు.

కొత్తలైన్ కోసం సంతకాల సేకరణ:

పెద్దగోపతి సబ్‌స్టేషన్ నుంచి కొత్తగా డబుల్‌రోడ్డు వేసిన రోడ్డు పక్కన నుంచి 11కేవీ కొత్త లైను వేసి, 24 గంటల త్రీఫేజ్ విద్యుత్ ఇవ్వాలని గ్రామంలో సంతకాలు సేకరణ చేసి జిల్లా కలెక్టర్‌కు గ్రీవెన్స్ ద్వారా సంతకాలతో చేసిన వినతిని సమర్పించారు.

కొత్తలైన్ నిర్మించాలి

● గండమాల సుధాకర్



పెద్దగోపతి విద్యుత్ సబ్‌స్టేషన్ ఉండి కూడా బొట్లకుంట గ్రామానికి వచ్చేలైన్ అమ్మపాలెం ఫీడర్ పరిధిలో ఉందని, దీనిని మార్చి కొత్తగా లైన్‌వేసి 24గంటలు త్రీఫేజ్ కరెంట్ వచ్చేలా చూడాలి. ప్రస్తుతం ఉన్న లైన్ సుబాబుల్, జమాయిల్ మధ్య ఉంది. తరుచూ అంతరాయ ఏర్పడుతుంది. పెద్దగోపతి పంచాయతీ పరిధిలో ఉన్న తమ గ్రామానికి 24 గంటలు కరెంట్ ఇవ్వలేక పోతున్నారు.

గతంలో ఉన్నలైన్‌ను మార్చాలి

● ఈదరు నాగేశ్వరరావు



ఉన్నతాధికారులు వచ్చి బొట్లకుంటకు వచ్చే లైన్‌ను పరిశీలించాలి. రైతుల సమస్యలను ఆలకించి పెద్దగోపతి నుంచి నేరుగా బొట్లకుంటకు కొత్తలైన్ వేసి విద్యుత్ సమస్యను లేకుండా చేయాలి. పెద్దగోపతి పంచాయతీలో ఉన్న తమ గ్రామానికి, రైతులకు 24 గంటల త్రీఫేజ్ విద్యుత్ ఇవ్వాలి. కొత్తగా వేసిన రోడ్డు పక్కన కొత్తలైన్ వేసి సమస్యను పరిష్కరించి, పంట పొలాలను కాపాడాలి.

అంతరాయం లేకుండా చూస్తాం

● విద్యుత్‌శాఖ ఏఈ సురేష్

బొట్లకుంటకు గతం నుంచి అమ్మపాలెం ఫీడర్ పరిధిలో నుంచే విద్యుత్ సరఫరా అవుతుంది. రైతులకు ఇబ్బందులు లేకుండా కరెంట్ ఇస్తున్నాం. పెద్దగోపతి సబ్‌స్టేషన్ నుంచి నేరుగా లైన్‌లేదు. ఉన్నలైనుకు విద్యుత్ అంతరాయం లేకుండా చూస్తాం. పగలంతా ఉంటుంది. రాత్రిపూటే ఆరు గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ నిలుస్తుంది. సమస్యను ఉన్నతాధికారులకు విన్నవిస్తాం.

మధ్యాహ్న భోజనాన్ని సక్రమంగా అందించాలి

» జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీజ



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ శ్రీజ

వైరా, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని సక్రమంగా అందించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ పి. శ్రీజ అన్నారు. బుధవారం మండలంలోని రెబ్బవరం హైస్కూల్‌ను ఆమె సందర్శించారు. హైస్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆరు, పదవ తరగతి విద్యార్థులకు ఇంగ్లీష్ ఆవశ్యకత గురించి వివరించారు. వచ్చే పదవతరగతి పరీక్షలకు ఎలా సిద్ధం అవ్వాలి, ఎక్కువ మార్కులు ఎలా సాధించాలో విద్యార్థులకు సూచనలు చేశారు. ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలి: ఆర్డీవో



కులగణన సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో రాజేంద్రగౌడ్

పెనుబల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కులగణన సర్వేను సమర్థవంతం నిర్వహించాలని ఆర్డీవో రాజేంద్రగౌడ్ అన్నారు. మండలంలోని లింగగూడెం గ్రామంలో జరుగుతున్న కులగణన సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్యూమరేటర్లకు పలు సూచనలు చేశారు. కుటుంబ సభ్యులతో సఖ్యతగా మెలిగి వివరాలను సమగ్రంగా సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంటా ప్రతాప్ పాల్గొన్నారు.

గ్రూప్-3 పరీక్షా కేంద్రాల పరిశీలన



కేంద్రాలను పరిశీలిస్తున్న ఏసీపీ రెహ్మాన్

కొణిజర్ల, నవంబరు13(ఆంధ్రజ్యోతి): గ్రూప్-3 పరీక్షలకు ఏర్పాటు చేసిన కేంద్రాలను బుధవారం వైరా ఏసీపీ రహమ్మాన్ పరిశీలించారు. పరీక్షాకేంద్రాల వద్ద ఎంత మంది సిబ్బంది అవసరమే తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు. కొణిజర్ల మండలంలో మొత్తం ఏడు పరీక్షాకేంద్రాలు ఉన్న దృష్ట్యా అన్ని కేంద్రాలకు ఉన్న వసతులను పరిశీలించారు. . ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరుగతాయని తెలిపారు. ఆయా కేంద్రాల పై స్థానిక ఎస్‌ఐకు సూచనలు చేశారు. ఏసీపీతో పాటు సీఐ సాగర్, ఎస్ఐ సూరజ్ పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి

సత్తుపల్లిరూరల్, నవంబరు13(ఆంధ్రజ్యోతి): పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి 416వ జయంతోత్సవాలు బుధవారం సత్తుపల్లి పట్టణంలోని విరాట్‌నగర్‌లోని శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి శిలామూర్తికి పంచామృత అభిషేకాలు, పూజలు నిర్వహించిన అనంతరం ప్రసాద వితరణ చశారు. కార్యక్రమంలో మొగుదుంపురం రామకృష్ణమాచారి, మోహనాచారి, ఏడుకొండలు, అప్పలాచారి, రవికుమార్, కోటేశ్వరమ్మ, శ్రీలక్ష్మి, జగదీశ్వరి, పుల్లాచారి, అప్పారావు, బాణాల సత్యనారాయణ, అర్చకులు రథం అచ్యుతాచార్యులు, మల్లాచారి పాల్గొన్నారు.

'మంచి ఫలితాలు వచ్చేలా శిక్షణ ఇవ్వాలి'

సత్తుపల్లిరూరల్, నవంబరు13(ఆంధ్రజ్యోతి): మంచి ఫలితాలు వచ్చేలా శిక్షణ ఇవ్వాలని ఎంఈవో నక్కా రాజేశ్వరరావు సూచించారు. బుధవారం స్థానిక జ్యోతి నిలయం స్కూల్‌లో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నాస్ ఎగ్జామ్ ఓరియంటేషన్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రీసోర్స్ పర్సన్స్ ద్వారా పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం నాస్ పరీక్ష ఫలితాల ఆవశ్యకతను తెలియజేసి జిల్లాను అగ్రస్థానంలో ఉంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ రవికుమార్ కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బిగ్ హెల్ప్ సహాయంతో కళావేదిక ఏర్పాటు

కొణిజర్ల, నవంబరు13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సింగరాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బిగ్‌హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ సహకారంతో కళావేదికను నిర్మించారు. ఆ కళావేదికను బుధవారం బిగ్ హెల్ప్ సంస్థ చైర్మన్ షాక్ చాంద్‌పాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పాఠశాలకు బిగ్ హెల్ప్ సహకారం ఉంటుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాన్ని పెంచుకొని మంచిస్థాయికి ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ, ఎంఈవో అబ్రహం, ప్రాజెక్టు డైరెక్టర్ రామానుజచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్షను విజయవంతం చేయండి

మధిర, నవంబరు13(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో డిసెంబర్ 4న నిర్వహించనున్న నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్షను విజయవంతం చేయాలని ఎంఈవో ప్రభాకర్ సూచించారు. బుధవారం మధిర మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండలంలోని అన్ని పాఠశాలల హెచ్‌ఎంల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ప్రాథమిక స్థాయినుంచే పోటీ పరీక్షలకు సమాయత్తం చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని అన్నారు. ఈసందర్భంగా రీసోర్స్ పర్సన్ జమీర్, శ్రీనివాసులు ఉపాధ్యాయులకు అవగాహన తరగతులు నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

దళారుల చేతిలో మోసపోతున్న రైతులు

» రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు రంజిత్‌కుమార్

ఏన్కూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): సీసీఐ కేంద్రం లేక మధ్య దళారుల చేతిలో పత్తి రైతులు నలిగిపోతున్నారని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు జాగర్లముడి రంజిత్‌కుమార్‌లు ఆరోపించారు. బుధవారం మార్కెట్ యార్డును సందర్శించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మార్కెట్ దళారీల మార్కెట్‌గా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారులు కుమ్మక్కై రూ.6వేలకు కొనుగోలు చేసి రైతులను మోసం చేయడం బాధాకరమన్నారు. ఏన్కూరు ప్రాంతంలో ప్రతి జిన్నింగ్ మిల్లు ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. మార్కెట్‌లో వేబ్రిడ్జి రిపేరులో ఉండి ఉపయోగం లేకపోవడంతో ప్రైవేటు వేబ్రిడ్జిలును రైతులు ఆచరించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు ఈకార్యక్రమంలో రైతుసంఘం జిల్లా నాయకుడు అమరనేని వీరభద్రం, తాళ్లూరి రమణ, మాదినేని వెంకన్న, రాచబండి యల్లయ్య, రమేష్‌కొత్తపల్లి బసవయ్య, వెంకన్న, ఆనంద్, పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలని జీపీ కార్మికుల వినతి

పెనుబల్లి, నవంబరు13(ఆంధ్రజ్యోతి): జీపీ కార్మికుల జీతాలను వెంటనే చెల్లించాలని మండల పరిషత్ సూపరింటెండెంట్ అచ్యుతవల్లికి బుధవారం కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 11నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని తెలిపారు. మూడునెలల జీతాల కోసం ట్రెజరీకి చెక్కులు పంపించినా అవి కూడా తమ ఖాతాల్లో జమకాలేదని వాపోయారు. జీతాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల చదువులు, ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని వెంటనే జీతాలు చెల్లించాలని ఆవినతి పత్రంలో కోరారు. అనంతరం ఇన్‌చార్జ్ ఎంపీవో ముస్తఫాకు కూడా వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జీపీ కార్మికుల కారోబార్, బిల్ కలెక్టర్స్ ఖమ్మంజిల్లా అధ్యక్షుడు దాసరి చెన్నారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కాసిన రంగారావు, మండల కార్యదర్శి మల్లెల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు వేము ఇజ్రాయేల్, నాయకులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సంక్షేమానికి రూ.200కోట్లు కేటాయించాలి

» ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లతీఫ్, శేషగిరిరావు

మధిర, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రతి సంవత్సరం 200కోట్లు రూపాయలను కేటాయించాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్. లతీఫ్, ఓరుగంటి శేషగిరిరావులు డిమాండ్ చేశారు. బుధవారం మధిర కోర్టులో న్యాయవాదుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ నవంబరు 30, డిసెంబర్ 1 తేదీలలో హనుమకొండలో ఐఏఎల్ రాష్ట్ర రెండోవ మహాసభలు జరగనున్నాయని వాటిని అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. గత రెండు సంవత్సరాలుగా న్యాయవాదుల సంక్షేమానికి ప్రభుత్వం రూ.100కోట్ల నిధులను విడుదల చేయడం లేదని తెలిపారు. ఈసందర్భంగా న్యాయవాదులతో కలిసి సంఘం రాష్ట్ర మహాసభల పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐఏఎల్ జిల్లా సహాయ కార్యదర్శి కొలికొండ శరత్‌బాబు, ఉపాధ్యక్షులు తేలప్రోలు వెంకట్రావు, సభ్యులు తోట రామాంజనేయులు, నంబూరి జనార్ధన్‌రావు, దిరిశాల జగన్మోహన్ రావు, కోట జ్ఞానేష్, ఎం. సతీష్, తూములూరి కృష్ణారావు, విజయకుమార్, శ్రీనివాస్ తదితరులున్నారు.

'ఎన్నికల వాగ్దానాలను అమలు చేయాలి'

తల్లాడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను వెంటనే అమలుచేయాలని సీపీఐ జిల్లా నాయకుడు మద్దోజు శ్రావణ్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం తల్లాడ మండలంలో సీపీఐ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నల్లమోతు నర్సింహారావు, ఓర్సు రమేష్, రాయప్ప, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టు చివరి వరకు సాగునీరందిస్తాం

» ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, నవంబరు13,(ఆంధ్రజ్యోతి): వైరాలో ఆయకట్టు చివరి భూముల వరకు సాగునీరు నీరందిస్తామని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. బుధవారం వైరాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయకట్టు రైతుల సమావేశం జరిగింది. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ సహా పలువురు నాయకులు పాల్గొన్నారు. రూ.42.10 కోట్లతో కాల్వల ఆధునీకరణ పనులు చేపట్టేందుకుగాను రబీలో సాగునీరు విడుదలపై నెలకొన్న సందిగ్ధతను ఈ సమావేశంలో తొలగించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క కృషితో మంజూరైన ఈ నిధులతో సకాలంలో ఆధునికీకరణ పనులు పూర్తిచేసేందుకు రైతులు సహకరించాలని నీటిపారుదల శాఖ ఈఈ బాబురావు, డీఈఈ శ్రీనివాసరావు కోరారు. ప్రతి గ్రామం నుంచి రైతులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. చివరికి రబీలో పంటల సాగుకు మార్చి చివరివరకు నీరు సరఫరా చేయాలని నిర్ణయించారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, ఏడీఏ తుమ్మలపల్లి కరుణ శ్రీ, ఏవో మంజుఖాన్, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకట నర్సిరెడ్డి, ఏదునూరి సీతరాములు, ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ దొడ్డా పుల్లయ్య, అఖిలపక్ష రైతు సంఘం నాయకులు దాసరి దానియేలు, బొంతు రాంబాబు, మందడపు మధుసూదన్‌రావు, యామాల గోపాలరావు, కే. అర్జున్‌రావు, మచ్చా నర్సింహారావు, మట్టూరి వెంకటేశ్వరరావు, బిడికే రత్నం, మచ్చా బుజ్జి, బోళ్ళ గంగారావు, మురళీ తదితరులున్నారు.

విద్యార్థులకు ప్లేట్లు వితరణ

బోనకల్, నవంబరు13(ఆంధ్రజ్యోతి): బోనకల్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 54 మంది విద్యార్థులకు బుధవారం బాగం సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బాగం రాకేష్ ప్లేట్లను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణను అలవరుచుకోవాలని సూచించారు. నైతిక విలువలతో కూడిన విద్యను చిన్నతనం నుంచే విద్యార్థులకు అందిస్తే వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేసినట్లు అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్. రమాదేవి, ఎస్ఐ మధుబాబు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి: డీఏవో



కొర్లగూడెంలో ఐకేపీ ధాన్యం కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఏవో పుల్లయ్య

కల్లూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొర్లగూడెం గ్రామంలో బుధవారం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటైన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా వ్యవసాయశాఖ అధికారి డి. పుల్లయ్య సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ కేంద్రానికి ధాన్యం తరలించే విషయంలో రైతులు తూర్పరా బట్టాలని, నాణ్యత ప్రమాణాలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాసరెడ్డి, ఏవో ఎం రూపా, ఐకేపీ ఏపీఎం వెంకటారామారావు పాల్గొన్నారు.

అదేవిధంగా డివిజన్ పరిధిలో గల పుల్లయ్య బంజరు, వీఎం బంజరా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం కల్లూరు ఏసీపీ ఏ. రఘు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం కేంద్రాల్లో విధుల్లో ఉన్న అధికారులను, సిబ్బందిని కొనుగోలు ప్రకియ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

ఘనంగా మహాపడిపూజ

తల్లాడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తల్లాడలో బుధవారం అయ్యప్ప స్వామి మహాపడిపూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. గురుస్వామి కొమ్మినేని రామయ్య 18వ పడి సందర్భంగా పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. రామయ్య- హైమావతి దంపతులు పడిపూజ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అర్చకుడు టి.మణికంఠ ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాలు, నవరసాలతో అభిషేకాలు, విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు కొమ్మినేని సత్యనారాయణ, ఈలప్రోలు లాలయ్య, తొండపు వెంకటేశ్వరరావు, భూక్యా బాలయ్య, నున్నా ఉత్తేజ్ పాల్గొన్నారు.

తల్లాడలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం



తల్లాడలో ధాన్యాన్ని కాంటా వేస్తున్న హమాలీలు

తల్లాడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తల్లాడలో బుధవారం కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించారు. స్థానిక సొసైటీ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రంలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి కాంటా వేశారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురితమైన 'కొనుగోళ్లలో జాప్యం... కల్లాల్లోనే ధాన్యం' అనే కథనానికి స్పందించిన అధికారులు ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించారు.

'నల్లవాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి'

ఏన్కూరు, నవంబరు13(ఆంధ్రజ్యోతి): జన్నారం ఆరికాయలపాడు గ్రామాల మధ్యలో ఉన్న నల్లవాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు రాకపోకల ఇబ్బందులను గమనించిన ఆరికాయలపాడు మాజీ ఉపసర్పంచ్ గుండ్ల వెంకటేశ్వరావు బుధవారం కొంత మేర సొంత ఖర్చులతో వాగు వద్ద దెబ్బతిన్న రోడ్డును మరమ్మతు పనులను చేయించారు. సొంత ఖర్చులతో రోడ్డు మరమ్మతులు చేపట్టిన వెంకటేశ్వరరావును గ్రామస్థులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

బోనకల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముష్టికుంట్ల బీటీసీ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బోనకల్ ఎస్‌బీఐ ఇన్‌చార్జ్ మేనేజర్‌కు తీవ్ర గాయలయ్యాయి. బోనకల్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట గల ఎస్‌బీఐ బ్రాంచ్ ఇన్‌చార్జ్ మేనేజర్‌గా సాయి సురేష్ విధులను నిర్వర్తిస్తున్నారు. విధుల నిర్వహణలో భాగంగా ఖమ్మం నుంచి బోనకల్‌కు స్కూటీ పై వస్తుండగా ఎదురుగా వస్తున్న టాటా ఏసీ వాహనం మరో వాహనాన్ని ఓవర్ టేక్ చేసే క్రమంలో స్కూటీని ఢీ కొట్టింది. ఈ సంఘటనలో సురేష్‌కు తీవ్ర గాయాలు కాగా, స్థానికులు వెంటనే అతడిని ఖమ్మంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన టాటా ఏసీ వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఆసుపత్రి నిర్మాణం కోసం స్థల పరిశీలన

ముదిగొండ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండల కేంద్రంలో 30పడకల ఆసుపత్రి నిర్మాణం కోసం బుధవారం స్థలాన్ని తహసీల్దార్ సునీత ఎల్జిబెత్ పరిశీలించారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని స్థలాన్ని పరిశీలించి సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారిణి అరుణాదేవి, మాజీ జడ్పీటీసీ మందరపు నాగేశ్వరరావు, ఆర్ఐ ప్రసన్నకుమార్, సర్వేయర్ ఉమామహేష్ పాల్గొన్నారు.

కూలిన కల్వర్టుకు తాత్కాలిక మరమ్మతులు

కొణిజర్ల, నవంబరు13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అనంతారం సమీపంలో రోడ్డు మధ్య కూలిన కల్వర్టుకు బుధవారం ఆర్‌అండ్‌బీ డీఈ రమేష్ దగ్గర ఉండి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్తిస్థాయిలో నూతన కల్వర్టు కోసం రూ. 1.15 కోట్లకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. భారీ లోడుల కారణంగా ప్రస్తుతం కూలిన కల్వర్టును తొలగించి, వాహనాలు నడిచేందుకు గ్రావెల్ పోయి రోడ్డును సిద్ధం చేసిన్నట్లు తెలిపారు. రాకపోకలకు ప్రస్తుతం ఇబ్బందులు లేకుండా చేశామని తెలిపారు.

వైభవంగా మంగళ కైశిక ద్వాదశి మహోత్సవం

కల్లూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) కల్లూరులో బుధవారం టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో వైభవంగా మంగళ కైశిక ద్వాదశి మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు సౌమిత్ర రామాచార్యులు నేతృత్వంలో ప్రత్యేక పూజలు, హరికథ గానం చేశారు.. కల్లూరు మండల దాసుల సంఘం ఆధ్వర్యంలో ఈ ఉత్సవాన్ని భక్తులు తిలకించేందుకు అన్ని విధాలుగా ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో దాసుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గుంటక శ్రీనివాసదాసు, మండల దాసుల సంఘం అధ్యక్షుడు గుంటక మోహన్ దాసు, సంఘ నాయకులు చింతలపూడి కృష్ణ, గుంటక రవి, భార్గవ్, నవీన్, బలరాం నాగరాజ కుమారి, జి. నాగలక్ష్మి జి. పుల్లమ్మ, చవల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో అన్నదాతల ఆందోళన

తల్లాడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలంలో బుధవారం ఒక్కసారిగా కురిసిన వర్షం వల్ల ధాన్యం రైతులు ఆందోళనకు గురయ్యారు. మండలంలోని బిల్లుపాడు, అంజనాపురం, కొత్త వెంకటగిరి, వెంగన్నపేట, మిట్టపల్లి, నూతనల్‌కల్, మల్సూర్, రంగంబంజర గ్రామాల్లో నూర్పిడి చేసి కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు తరలించి కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం వర్షం తడుస్తుందని భావించిన రైతులు హడావుడిగా టార్పాలిన్లను తెచ్చి ధాన్యం కుప్పలపై కప్పారు. అయినప్పటికీ కప్పిన పట్టాలపై వర్షపునీరు నిలిచింది.

వేంసూరులో...

వేంసూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వేంసూరు మండలంలో బుధవారం సాయంత్రం ఒక్కసారిగా వర్షం కురవడంతో ధాన్యం రైతులు ఆందోళనకు గురయ్యారు. మండలంలోని లింగపాలెం, మర్లపాడు, వేంసూరు, భీమవరం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని కల్లాల్లో దాన్యాన్ని ఆరబెట్టారు. అకస్మాత్తుగా వర్షం కురవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. కల్లాల్లో ఆరబోసిన ధాన్యంపై రైతులు టార్పాలిన్లను కప్పినప్పటికీ నీరు చేరింది. గత సెప్టెంబరులో కురిసిన అకాల వర్షంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. సాయంత్రం సమయంలో వాతావరణం మేఘావృతం కావడంతో గ్రీన్‌ఫీల్డ్ హైవే పక్కన ఆరబెట్టిన ధాన్యాన్ని రైతులు కాపాడుకునే ప్రయత్నం చేసినప్పటికీ వర్షం కురిసింది. పంట చేతికొచ్చిన సమయంలో వర్షం కురవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



కల్లాల్లోని ధాన్యంపై పట్టాలు కప్పుతున్న రైతులు